

# అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

02.09.2026
బుధవారం | రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 63
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## టెర్రరిజాన్ని తుడిచిపెట్టేయాలి

- వ్యవస్థను సమూలంగా కూల్చివేయాలి
- ఎస్‌సిఓ సదస్సులో పాక్ ప్రధానికి మోదీ చురకలు
- షాంఘై సహకార సంస్థ 26 వ శిఖరాగ్ర సదస్సు
- చైనా, రష్యా అధ్యక్షులు సహా దేశాధినేతలు హాజరు



**టెహ్రాన్, సెప్టెంబర్ 01, అనంతజనశక్తి న్యూస్**

ఉగ్రవాదంపై పోరాటంలో ఎలాంటి ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదని, ఆర్థిక సహకారం, రిక్రూట్ మెంట్, రాడికలైజేషన్, సురక్షిత స్థావరాలు సహా దాని మొత్తం వ్యవస్థను సమూలంగా తుడిచిపెట్టాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం పిలుపునిచ్చారు. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్‌కేక్ వేదికగా జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సును ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడారు.ఈ ఈ

2లో..

## విద్యార్థులపై ఎలాంటి చర్యలు ఉండవు

- ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాం
- కేంద్ర మంత్రి జేపీ నడ్డా వెల్లడి
- నమోదైన కేసులను ఎత్తివేసే ప్రక్రియను వేగవంతం
- విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునే నిర్ణయం

2లో..



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 01, అనంతజనశక్తి న్‌ఊస్**

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేసే ప్రక్రియను వేగవంతం చేసినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఈ ఏడాది జులై నెలలో ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోబోమని ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకుందని నడ్డా పేర్కొన్నారు.

# కొండా సురేఖకు ఢిల్లీ పిలుపు

- హైకమాండ్ పిలుపుతో హస్తినకు సురేఖ
- కేసీ వేణుగోపాల్‌తో భేటీకి ఛాన్స్
- ఖర్గే అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నాలు
- కుమార్తె వ్యాఖ్యలపై వివరణ ఇవ్వనున్నారా?
- సురేఖపై చర్య ఉంటుందా? ఉత్కంఠ
- రాజీనామాపై ఊహాగానాలు
- రేవంత్ ఢిల్లీ పర్యటనతో వేడి
- కేబినెట్ విస్తరణపై చర్చలు?



**హైదరాబాద్, సెప్టెంబర్ 01, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మరోసారి రాజకీయ ఉత్కంఠ తీవ్ర స్థాయికి చేరుకుంది. మంత్రి కొండా సురేఖ కు.. ఢిల్లీ హైకమాండ్ నుంచి పిలుపు రావడం, ఆమె హస్తినకు బయల్దేరడం ఇప్పుడు పార్టీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి వచ్చిన పిలుపు నేపథ్యంలోనే ఆమె హస్తినకు వెళ్లినట్లు సమాచారం. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కొండా సురేఖ భేటీ కానున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్ కోసం కూడా కొండా సురేఖ ప్రయత్నించినట్లు సమాచారం. దీంతో కొండా సురేఖ విషయంలో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోందనే చర్చ జోరందుకుంది.

గత కొంతకాలంగా మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మితలకు సంబంధించిన వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. ఇటీవలే గీసుకొండలో సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తం కావడంతో పాటు.. పార్టీ క్రమశిక్షణ కమిటీ కూడా స్పందించింది.

7లో..

## బీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్ రెడ్డి

- కవిత మధ్యలో వచ్చి మధ్యలో వెళ్లిపోయింది
- వేముల ప్రశాంత్ రెడ్డి కామెంట్
- కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో ఆలోచించు
- మిమ్మల్ని కలుపడానికే ప్రయత్నించాను
- విడగొట్టడానికి కాదు అని మాజీ మంత్రి వెల్లడి

2లో..



**హైదరాబాద్, సెప్టెంబర్ 01, అనంత జనశక్తి న్యూస్**

సీఆర్‌కు కష్టకాలంలో వెంట ఉన్నది ఎవరో ముందు కవిత తెలుసుకోవాలి. నీ వల్ల నీ తండ్రి కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో ఆలోచించావా కవిత? మిమ్మల్ని కలుపడానికే ప్రయత్నించానే తప్పా విడగొట్టడానికి కాదు అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. తనపై మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై వేముల స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేను ఏం చేశానే ఉద్యమ నాయకుడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు స్పష్టంగా తెలుసన్నారు. పార్టీ లైను దాటిన తర్వాతనే కవితపై చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

## 'సర్' గడువు పెంపు

- ఈ నెల 10 వరకు పెంచుతూ నిర్ణయం
- కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) వెల్లడి
- అభ్యంతరాల పరిష్కారానికి అక్టోబర్ 5 వరకు
- అక్టోబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల

2లో..



## మరో రూ.100 కోట్లు మంజూరు

- గోదావరి తీర గ్రామాల అభివృద్ధికి
- డిప్యూటీ సీఎం పవన్ సంచలన నిర్ణయం
- మౌలిక సదుపాయాల కల్పన కోసం
- గ్రామీణాభివృద్ధి పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం



**అమరావతి, సెప్టెంబర్ 01, అనంత జనశక్తి న్యూస్**

దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలు.. దేశ అభివృద్ధి గ్రామాల అభివృద్ధితోనే సాధ్యమవుతుందన్న గాంధీజీ మాటలను ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి చేతల్లో చూపిస్తున్నారు. గోదావరి తీర ప్రాంతంలోని గ్రామాలను అభివృద్ధి చేయడానికి ఇప్పటికే ఏపీపీసీబీ ద్వారా రూ.100 కోట్ల నిధులను మంజూరు చేయించిన పవన్.. ఇప్పుడు మరో రూ.100 కోట్ల నిధులను మంజూరు చేయించారు.

2లో..

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- మాజీ మంత్రి హరీశ్‌రావు
- మంచి కంటే సృష్టించిన విధ్వంసమే ఎక్కువ
- వెయ్యి రోజుల పాలనపై విమర్శలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 01, అనంత జనశక్తి న్యూస్**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన మంచి కంటే సృష్టించిన విధ్వంసమే ఎక్కువ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. దీనికి విద్యార్థుల భవిష్యత్తే ప్రత్యక్ష సాక్ష్యమన్నారు.

2లో..

## నీట్ కేసులు రద్దు చేయండి

- సుప్రీంకోర్టును కోరిన 4 రాష్ట్రాలు
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం..
- విద్యార్థులపై నమోదైన 116 ఎఫ్ఐఆర్‌లు



2లో..

## ఉత్తరాంధ్ర కల సాకారం దిశగా మరో కీలక ముందడుగు


- సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పోలవరం ఎడమ కాలువ ఫస్ట్ ఫేజ్‌కు జలహారతి
- ఎల్ఎంసీతో విశాఖకు తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి భద్రత
- రెండేళ్లలో ఎల్ఎంసీ పనులను పూర్తి చేశాం-మంత్రి నిమ్మల రామానాయుడు

5లో..

## చేనేతలకు ఆప్కో చెల్లింపులు

- కొనుగోళ్లు చేసిన వస్త్రాలకు ఎప్పటికప్పుడు సహకార సంఘాలకు చెల్లింపులు
- రెండేళ్లలో రూ.24.51 వస్త్రాలకు పేమెంట్లు
- సత్ఫలితాలిస్తున్న మంత్రి సవిత సమీక్షలు
- మొదటి ఏడాది రూ.18.02 కోట్ల మేర చెల్లింపులు

5లో..



ఆప్కో

## విజయసాయిరెడ్డిని సజ్జల కొట్టింది నిజమే

- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి
- మంగళగిరిలో ప్లీనరీ జరిగేటప్పుడు..
- వేదికపై ఎవరితో మాట్లాడించాలనే విషయంపై
- రెస్ట్ రూమ్‌లో ఇద్దరి మధ్య వివాదం
- మాటామాటా పెరిగి కొట్టింది వాస్తవమే

2లో..

## ఎంపీ ల్యాడ్స్ నిధులపై అసత్య ప్రచారం చేయొద్దు

- కేంద్ర మంత్రి బండి సంజయ్
- ఎంపవర్ ఇండియన్ సంస్థ నివేదిక విడుదల
- సభ్యులు పూర్తిగా వెనుకబడ్డారన్నది..
- నివేదిక సత్యదూరమని బండి కామెంట్

5లో..





## విద్యార్థులపై ఎలాంటి చర్యలు ఉండవు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రంతో పాటు బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి, విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసే ప్రక్రియను వేగవంతం చేసినట్లు నడ్డా తెలిపారు. విద్యార్థులు, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సానుకూల చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. దేశ యువత, విద్యార్థుల అభ్యున్నతి, వికాసమే ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని నడ్డా చెప్పుకొచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సెప్టెంబర్ 5న నిర్వహించాల్సిన ర్యాలీని విరమించుకుంటున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించడాన్నీ కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్వాగతించారు.

కాగా, నీట్ పేపర్ లీక్‌తో దేశ రాజధాని సహా పలు రాష్ట్రాల్లో సీజేపీ కార్యకర్తలు పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. కొన్ని వారాలపాటు ఆందోళనలు కొనసాగగా.. జులై 20 నుంచి 25 మధ్య పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. దీంతో ఢిల్లీతో పాటు పలు రాష్ట్రాల్లో నిరసనకారులపై కేసులు నమోదయ్యాయి. అయితే, విద్యార్థులపై నమోదైన అన్ని కేసులను సుప్రీంకోర్టు నేడు రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. సీజేపీ నిరసనలకు సంబంధించిన కేసులను ఉపసంహరించుకుంటామని, కొత్త ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమన్న కేంద్ర ప్రభుత్వ హామీ మేరకు సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది.

## నీట్ కేసులు రద్దు చేయండి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 01, అనంజతనశక్తి న్యూస్**

నీట్ పేపర్ లీక్ అంశంపై విద్యార్థుల ఆందోళనలకు సంబంధించి నమోదైన కేసుల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. విద్యార్థులపై నమోదైన 116 ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయాలని కోరుతూ బిహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, అస్సాం రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం తమ రాష్ట్రాల్లో నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరుతూ 4 రాష్ట్రాలు వేర్వేరు పిటిషన్లలో విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. విద్యార్థులు ఆందోళనలు విరమిస్తే వారిపై నమోదైన కేసులను ఉపసంహరించుకుంటామని జులై 25న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కి ఇచ్చిన హామీని ఆయా రాష్ట్రాలు తమ పిటిషన్లలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన కేసులను రద్దు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం.

విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో ఈ నెల 5న ఢిల్లీలో ర్యాలీ నిర్వహించేందుకు సీజేపీ పిలుపునిచ్చిన నేపథ్యంలో కేంద్రం, రాష్ట్రాలు వేగంగా స్పందించినట్లు తెలుస్తోంది. దీంతో విద్యార్థుల ఆందోళనలకు సంబంధించిన కేసుల ఉపసంహరణపై సుప్రీంకోర్టు తదుపరి విచారణలో కీలక నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి




(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనకు నేటితో వెయ్యి రోజులు పూర్తయ్యాయని పేర్కొంటూ 'ఎక్స్'లో హరీశ్‌రావు పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌పై విమర్శలు గుప్పించారు. ''ప్రతిపక్షాలపై అసత్యాలు ప్రచారం చేయడంపై ఉన్న శ్రద్ధ.. క్షేత్రస్థాయిలో పిల్లలు పడుతున్న గోస మీద ఎందుకు లేదు? ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీలు విద్యార్థులను వేధిస్తున్నాయి. కష్టపడి చదువుకున్నా సర్టిఫికెట్లు చేతికి రాక.. అటు ఉద్యోగాలకు, ఇటు పైచదువులకు వెళ్లలేక వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి'' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## మరో రూ.100 కోట్లు మంజూరు

(మొదటి పేజీ తరువాయి)

ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. మొత్తం నిధులలో రూ.90 కోట్ల నిధులను పంచాయతీరాజ్ శాఖ మంజూరు చేయగా, రూ.10 కోట్లను ఆర్‌డబ్ల్యూఎస్ నుంచి మంజూరు చేయించారు. ఈ నిధులను గోదావరి తీర ప్రాంతంలోని ఏడు నియోజకవర్గాల అభివృద్ధికి కేటాయించనున్నారు. మొత్తం రూ.100 కోట్లలో గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి రూ.90 కోట్లను కేటాయించనున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ తెలిపారు. మిగిలిన రూ.10 కోట్లలతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సదుపాయాలను కల్పిస్తామని ఆయన తెలిపారు.



# టెర్రరిజాన్ని తుడిచిపెట్టేయాలి

(మొదటి పేజీ తరువాయి)

'మానవాళి మొత్తానికి ఉగ్రవాదం తీవ్రమైన సవాల్' అని అభివర్ణించారు. దీనిపై పోరాటం కేవలం 'చర్యప్రతిచర్య' ఆలోచనకే పరిమితం కాకూడదని స్పష్టం చేశారు. ఈ మేరకు సదస్సుకు హాజరైన పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్‌కు మోదీ చురకలంటించారు.

''ఉగ్రవాదానికి సంబంధించి ఫైనాన్సింగ్, రిక్రూట్‌మెంట్, రాడికలైజేషన్, సురక్షిత స్థావరాలు సహా మొత్తం నెట్‌వర్క్‌ను మనం నిర్మూలించాలి. ఈ తీవ్రమైన అంశంపై ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని మనం ఒకే గొంతుతో స్పష్టం చేయాలి' అని ఆయన అన్నారు. ''ఉగ్రవాదాన్ని తమ విధానంగా మార్చుకుని వారికి ఆశ్రయం, మద్దతు ఇస్తున్న దేశాలకు... ఉగ్రవాదం ఎప్పటికీ ఎవరికీ 'హామీ ఇచ్చే వ్యూహాత్మక ఆస్తి' కాజాలదని గట్టి సందేశం పంపాలి'' అని ప్రధాని స్పష్టం చేశారు.

షాంఘై సహకార కార్పొరేషన్ కోసం భారత విజన్ వెల్లడించిన ఆయన.. ''భద్రత, అనుసంధానత, అవకాశాలు'' అనే మూడు ముఖ్యమైన స్తంభాలని వివరించారు. వీటిలో శాంతి భద్రత మొదటి స్తంభంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ''ప్రశాంతమైన, సురక్షితమైన యురేషియా కోసం మన ఉమ్మడి కార్యాచరణ..



అఫ్ఘనిస్థాన్‌లో శాంతి, స్థిరత్వంతో ముడిపడి ఉంది'' అని నొక్కిచెప్పిన మోదీ.. అఫ్గన్ ప్రజలకు భారత్ తన అభివృద్ధి, మానవతా సహాయాన్ని కొనసాగిస్తుందని పునరుద్ఘాటించారు.

పశ్చిమాసియా సంక్షోభంపై మాట్లాడుతూ.. ఒక ప్రాంతంలో ఘర్షణలు ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతాయని, ముఖ్యంగా 'ఇంధన భద్రత, సముద్ర వాణిజ్యం, సరఫరా గొలుసులపై' దెబ్బతీస్తాయని మోదీ అన్నారు. ''దీనివల్ల అభివృద్ధి చెందుతున్న దేశాలే అత్యధికంగా నష్టపోతున్నాయి.. అందుకే అన్ని రకాల ఉద్రిక్తతలు, యుద్ధాలకు పరిష్కారం యుద్ధభూమిలో సాధ్యం కాదని, కేవలం 'చర్చలు, దౌత్యం' ద్వారానే సాధ్యమని భారత్ పదే పదే నొక్కి చెబుతుంది'' అని అన్నారు.

మరోవైపు... డ్రగ్స్ అక్రమ రవాణా యువతకు, ప్రాంతీయ భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించిందని ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. భద్రతా బెదిరింపులు, వ్యవస్థీకృత నేరాలు, సమాచార భద్రత, నార్కోటిక్స్ వ్యవహారాలను పర్యవేక్షించే ఎస్‌సిఓ యంత్రాంగాల ద్వారా మరింత బలమైన సహకారం అందించాలని కోరారు. ''సకాలంలో చర్యలు చేపట్టడానికి, ఆచరణాత్మక సమన్వయానికి ఇవి సమర్థవంతమైన మాధ్యమాలుగా మారాలి'' అని మోదీ పిలుపునిచ్చారు.

ఎస్‌సిఓ సహకారం ప్రజలకు స్పష్టమైన ప్రయోజనాలను అందించాలని, భవిష్యత్ కార్యాచరణలో 'ప్రజల మధ్య సంబంధాల'ను కేంద్ర బిందువుగా ఉంచాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ''మన ప్రయత్నాలు యువతకు ఎన్ని కొత్త అవకాశాలను సృష్టించాయి.. మన పారిశ్రామికవేత్తలకు ఎన్ని కొత్త మార్కెట్లను తెరిచాయి.. సాంకేతికత ద్వారా మన రైతులకు ఎంత లబ్ధి చేకూరింది.. మన పౌరుల జీవితాలు ఎంతగా మెరుగుపడ్డాయి అనేదే మన విజయాన్ని కొలిచే నిజమైన కొలమానం'' అని వ్యాఖ్యానించారు.

ఈ శిఖరాగ్ర సదస్సుకు కిర్గిజిస్థాన్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ అధ్యక్షత వహించి, ఆతిథ్యం ఇచ్చారు. ప్రధాని మోదీతో పాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ , ఇరాన్ అధ్యక్షుడు మసూర్ పెజెష్కియాన్, ఇతర ఎస్‌సిఓ సభ్యదేశాల నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

నేను మా తండ్రి వేముల సురేందర్ రెడ్డి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులం . 2001 తెలంగాణ ఆవిర్భావా ని కన్న ముందే టీఆర్ఎస్ పార్టీలో ఉన్నాం. బీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి అంటేనే బీఆర్ఎస్ పార్టీ. కవిత మధ్యలో వచ్చింద్రు మధ్యలో పోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీతో నేను మంతనాలు చేశానని అంటున్న కవిత... ఇప్పుడు కష్ట కాలంలో కేసీఆర్ వెంట ఉన్నది నేనా కవితనా? అని సూటిగా ప్రశ్నించారు. అసెంబ్లీలో, అసెంబ్లీ బయట, జిల్లాలో రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నది ఎవరో అందరికి తెలుసన్నారు.

లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ఉన్న నేను కాంగ్రెస్‌లోని ఎవరితో మంతనాలు చేయలేదని స్పష్టం చేశారు. కవిత కాంగ్రెస్ నాయకులతో రహస్యంగా మంతనాలు చేయలేదని చెప్పగలదా? అని నిలదీశారు. నిరాధారణమైన ఆరోపణలు ఎవరి లాభం కోసం చేస్తున్నావని మండిపడ్డారు. స్వలాభం కోసం వ్యక్తి



గత ప్రతిష్టలు దెబ్బ తీసే విధంగా మాట్లాడడం కరెక్ట్ కాదని హితవు పలికారు. నాపై నిరాధారమైన ఆరోపణలు చేసే హక్కు కవితకు లేదని తెలిపారు. మొదటి నుంచి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులుగా ఉన్నా వాళ్లను కవిత టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు.

**అధికార పార్టీకి కవిత న్యాయం చేస్తున్నది**

కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తుంది. ప్రత్యక్షంగా మా నాయకత్వాన్ని బలహీనపరిచి పరోక్షంగా అధికార పార్టీకి కవిత న్యాయం చేస్తుందని విమర్శించారు. కవిత సభలో కన్నీళ్లు పెట్టుకోవడం రాజకీయంగా సింపతిని గేన్ చేయడానికి అని అర్థం అవుతుందని, అది ఆమె విజ్ఞతకు వదిలేస్తున్నామని పేర్కొన్నారు. కవిత చేసే ఈ పనుల వల్ల కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో బిడ్డగా ఆమె ఆలోచించ దం లేదు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్

ఆయన పైన కేటీఆర్ పైన విమర్శలు చేయగా లేనిది మాపై చేయడం పెద్ద ఆశ్చర్యాన్ని కలిగించలేదన్నారు. కానీ బాధగా అనిపించిందన్నారు. కవితను రెండుసార్లు ఎమ్మెల్సీగా చేయడంలో నా పాత్ర ఏందో కేసీఆర్‌కు బాగా తెలుసు. కవిత పై మొన్నటి వరకు కేసీఆర్ బిడ్డగా గౌరవం ఉండేది. నిన్నటి మాటలతో ఆ గౌరవాన్ని కవిత పోగొట్టుకుందన్నారు.

## 'సర్' గడువు పెంపు

**అమరావతి, సెప్టెంబర్ 01, అనంత జనశక్తి న్యూస్**

ఏపీలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) పొడిగించింది. ఈ నెల 10 వరకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారానికి అక్టోబర్ 5 వరకు అవకాశం ఇచ్చింది. అక్టోబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనుంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అభ్యర్థన మేరకు ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను సవరించి గడువును పొడిగించింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సెప్టెంబర్ 10వ తేదీ వరకు దాఖలు చేసుకోవచ్చు. ఓటర్ల నుంచి అందే క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించేందుకు అక్టోబర్ 5వ తేదీ వరకు అవకాశం కల్పించారు.

అనంతరం అన్ని ప్రక్రియలను పూర్తి చేసి అక్టోబర్ 9న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. దీంతో ఓటర్లకు తమ వివరాలను పరిశీలించుకుని, ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే గడువులోగా తెలియజేసే అవకాశం మరింత పెరిగింది. సవరించిన ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను వెంటనే రాష్ట్ర గెజిట్‌లో ప్రచురించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. అలాగే షెడ్యూల్‌లో చేసిన మార్పులపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి సూచించింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ



ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, అనర్హమైన లేదా తప్పుగా నమోదైన వివరాలను సరిచేసేందుకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల ప్రక్రియ కీలకంగా ఉంటుంది. గడువు పొడిగింపుతో ఓటర్లకు తమ వివరాలను పరిశీలించుకునేందుకు అదనపు సమయం లభించనుంది.

# విజయసాయిరెడ్డిని సజ్జల కొట్టింది నిజమే

**అమరావతి, సెప్టెంబర్ 01, అనంత జనశక్తి న్యూస్**

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డిపై తెలుగుదేశం పార్టీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి.. విజయసాయిరెడ్డిని కొట్టింది నిజమేనని తెలిపారు. మంగళగిరిలో ప్లీనరీ జరిగేటప్పుడు రెస్ట్ రూమ్‌లో వేదికపై ఎవరితో మాట్లాడించాలనే విషయంపై వీరిద్దరి మధ్య వివాదం తలెత్తి, మాటామాటా పెరిగి కొట్టింది వాస్తవమేనని చెప్పుకొచ్చారు. ఆ విషయం చాలామంది నేతలకు తెలుసునని అన్నారు. విజయసాయికి వైసీపీలో 72 అవమానాలు జరిగాయని చెప్పారు. ఆయన నెల్లూరు లోక్‌సభ నుంచి పోటీ చేసినప్పుడు ఎంత నీచంగా, ఘోరంగా మాట్లాడారో అందరికీ తెలుసునని పేర్కొన్నారు.

**సజ్జల దారుణంగా దూషించారు..**

ఈరోజు (మంగళవారం) నెల్లూరులో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు ఒక్కడికే తెలిసి మరో ఘోర అవమానం జరిగిందని అన్నారు. విజయసాయి తన సొంతూరైన తాళ్లపూడికి వచ్చినప్పుడు, కాకుపల్లి సెంటర్‌లో వంద వాహనాలతో ఘనంగా స్వాగతం పలికారని వెల్లడించారు. దానిపై విజయసాయిని సజ్జల దారుణంగా దూషించారని చెప్పుకొచ్చారు. ఆ మాటలు చెప్పలేని విధంగా ఉన్నాయని అన్నారు.



**విజయసాయిపై నాకు మంచి అభిప్రాయం లేదు..**

'నేను చాలా పెద్ద తప్పు చేశానని సజ్జల అన్నారు. అమరావతి రైతులు వరదలు, భారీ వర్షాల్లో ఇబ్బందులు పడుతుంటే నేను మాట్లాడాను. నెల్లూరు రూరల్ నియోజకవర్గం దాటేంత వరకు ఏ ఇబ్బంది వచ్చినా నేను అండగా ఉంటానని చెప్పా. అప్పుడూ సజ్జల... నన్ను చాలా పెద్ద తప్పు చేశావన్నారు. ఇలాంటి మాటలు నాతో మాట్లాడొద్దని.. ఆ తప్పు చేసింది.. నువ్వా, నేనా..? అని సజ్జలను ఎదిరించి మాట్లాడాను. మా ఊరిలో విజయసాయి మీటింగ్ పెట్టి నన్ను ఎలా పడితే అలా తిట్టాడు. ఆయనంటే నాకు మంచి అభిప్రాయం లేదు' అని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు.

**వైసీపీ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతోంది..**

'వైసీపీ హయాంలోని ఐదేళ్లు ప్రజావ్యతిరేక పాలన కొనసాగింది. దేశవిదేశాల నుంచి ఆంధ్రులు వచ్చి ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లు వేసి కూటమిని గెలిపించారు. కూటమి ప్రభుత్వ ఘనవిజయం ఓ చరిత్ర అయితే, వైసీపీ ఘోర పరాజయం కూడా చారిత్రక ఘట్టం. ఎందుకు ఓడిపోయామనే ఆలోచన లేకుండా... వైసీపీ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ వికృత రాజకీయం చేస్తోంది. వైసీపీ నేతలు అబద్ధాలు చెబుతున్నారు. హిందూ మతానికి ఘోర అన్యాయం జరిగిందని వైసీపీ నేతలు ఎలా మాట్లాడుతున్నారో అర్థం కావట్లేదు. ఆలయాల్లో రథాలు తగులపడినప్పుడు, విగ్రహాల తలలు తెగ్గొట్టినప్పుడు, సింహాల విగ్రహాలు చోరీకి గురైనప్పుడు మీ నోళ్లు ఏమయ్యాయి. తిరుపతి వేంకటేశ్వర ఛానెల్‌ను కూడా రాజకీయాలకు వాడుకున్నారు. వైసీపీ మాజీ మంత్రిపై ఆయన కోడలు సంచలన ఆరోపణలు చేశారు. ఆమె పెళ్లి అయినప్పుడు హిందువులమని మాజీ మంత్రి చెప్పారని... పెళ్లి అయ్యాక హిందు దేవుళ్లని పూజిస్తే కొట్టారని ఆమె చెప్పింది. జగన్, వైసీపీ నేతలు, సాక్షి మీడియా ఎందుకు ఈ విషయంపై స్పందించట్లేదు. ఏపీని అస్థిరపరచాలని ఓ భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు రాకూడదని ఫేక్ వీడియోలతో ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకోం. వైసీపీ క్రెడిట్ చోరీ చూస్తుంటే... నాగార్జునసాగర్, సోమశిల, తెలుగుగంగ ప్రాజెక్టులు కట్టింది జగనే అని చెప్పేటట్లుగా ఉన్నారు. ఇంకా ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కూడా జగనే అని చెప్పేటట్లుగా ఉన్నారు' అని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు.


## మమతా బెనర్జీ మేనకోడలు అనుమానాస్పద మృతి

**కోల్‌కతా అనంత జనశక్తి న్యూస్**

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ మేనకోడలు 28 ఏళ్ల బ్రిస్టీ ముఖర్జీ అనుమానాస్పద రీతిలో మృతిచెందారు. బీర్భుమ్ జిల్లా కుసుంబా గ్రామంలోని తన ఇంట్లో మంగళవారం ఆమె మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఉరికి వేలాడుతూ కనిపించారని, దీనిని ఆత్మహత్య కేసుగా భావిస్తున్నామని పేర్కొన్నారు. రాంపూర్‌హాట్ ప్రాంతంలోని కుసుంబా గ్రామంలోని ఆమె ఇంటి రెండో అంతస్తులోని ఒక గదిలో బ్రిస్టీ ముఖర్జీ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపినట్లు పీటీఐ వార్తా సంస్థ నివేదించింది.

ఆమె మరణానికి దారితీసిన పరిస్థితులపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. ''మృతదేహాన్ని పోస్ట్‌మార్టం పరీక్ష కోసం తరలించాం.. దర్యాప్తు కొనసాగుతోంది. పోస్ట్‌మార్టం, విచారణ అనంతరం మరణానికి దారితీసిన పరిస్థితులు స్పష్టమవుతాయి'' అని ఆయన అన్నారు. కుటుంబసభ్యుల ప్రకారం.. వైవాహిక బంధం సాఫీగా సాగలేదని, విడాకుల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. గత కొన్నేళ్లుగా డిప్రెషన్‌తో బాధపడుతోన్న బ్రిస్టీ.. వైద్య చికిత్స తీసుకుంటున్నట్టు వివరించారు. స్థానిక తృణమూల్ కాంగ్రెస్ నేత అయిన బ్రిస్టీ తండ్రి నిహార్ ముఖర్జీ.. మమతా బెనర్జీకి కజిన్. బెంగాల్‌ను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణంలో ఆమె టీచర్‌గా ఎంపికయ్యారనే ఆరోపణలను రిష్టి ముఖర్జీ ఎదుర్కొన్నారు. అయితే, నియామక ప్రక్రియలో అవకతవకల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో నియామకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల తర్వాత ఆమె ఉద్యోగం కోల్పోయారని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. ముఖర్జీ మరణంపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. పోస్ట్‌మార్టం నివేదికలో మృతికి గల కారణాలపై మరింత స్పష్టతనిస్తుందని భావిస్తున్నారు. కొద్ది రోజుల కిందట రాంపూర్‌హాట్‌లోని పార్టీ కార్యాలయంలో సీనియర్ తృణమూల్ కాంగ్రెస్ నేత, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ ఆశిష్ బెనర్జీ ఉరి వేసుకున్న కొద్ది రోజులకే ఆమె మరణం సంభవించింది.

# నేపాల్ వరదల్లో తల్లిదండ్రుల గల్లంతు.. కన్నీటితోనే నీట్ పరీక్ష




నేపాల్ వరదల్లో తల్లిదండ్రులు గల్లంతైనా.. ఆ బాధను అదిమిపెట్టి ఓ యువతి నీట్ పరీక్ష రాసింది. కైలాస మానసరోవర యాత్ర కోసం వెళ్లిన వందలాది మంది భారతీయులు నేపాల్ వరదల్లో గల్లంతయ్యారు. ఈ యాత్రకు వెళ్లిన తన తల్లిదండ్రులు కూడా చిక్కుకుపోయారని


తన్వి అనే నీట్ అభ్యర్థి సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేశారు. తన తల్లిదండ్రులు వెంకట్రామ్ అన్నందేవర, అనఘ 67 మందితో కూడిన బృందంతో కలిసి కైలాస యాత్రకు వెళ్లినట్లు తెలిపారు. వారు నేపాల్‌లోని ఇమిగ్రేషన్ సెంటర్ వద్ద ఉన్నప్పుడు చివరిసారిగా తనతో మాట్లాడారని తెలిపింది. ప్రస్తుతం వారు తన పక్కన లేకపోయినా.. వారి కోరిక మేరకు నీట్ పరీక్ష రాశానని చెప్పారు.

'మూడు గంటల పరీక్షా సమయంలో దాదాపు సగం సమయం కన్నీళ్లతోనే గడిపాను. అడ్మిట్ కార్డుపై ఉన్న ఫొటోను నా తండ్రే తీశారు. పరీక్ష రాస్తున్నప్పుడు అది కనిపించి, ఆయన పదే పదే గుర్తుకు రావడంతో తీవ్ర భావోద్వేగానికి గురయ్యాను. మానసికంగా ఎంతో సంఘర్షణకు గురైనప్పటికీ.. అమ్మానాన్న కోరిక మేరకు ఈ పరీక్ష తప్పకుండా రాయాలని నిర్ణయించుకున్నా. నా భవిష్యత్తు కోసం వారు ఎన్నో కలలు కన్నారు. నేను ఏ పరీక్షకు వెళ్లినా.. అందులో మంచి మార్కులు సాధించాలని కోరుతూ అమ్మ ప్రతిసారి పెరుగులో పంచదార కలిపి తినిపించేది. కానీ ఇప్పుడు ఆమె నా పక్కన లేకపోవడం నన్ను మరింత కుంగదీసింది. వారు సురక్షితంగా తిరిగి వస్తారనే నమ్మకంతో ఎదురు చూస్తున్నా' అని తన్వి కన్నీరు పెట్టుకున్నారు.

# మాపై బాహ్య ఒత్తిళ్లేమీ లేవు


**- సోనియా గాంధీ ఆత్మకథ ప్రచురణ వివాదంపై పెంగ్విన్ ఇండియా వెల్లడి**

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' గ్రంథాన్ని ప్రచురించకపోవడానికి తమపై బాహ్య ఒత్తిళ్లే కారణం అంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా (పీఆర్‌హెచ్‌ఐ) సంస్థ పేర్కొంది. ఆ పుస్తక రచయిత్రితో చర్చల సమయంలో ఒక నిర్దిష్ట అంశంపై ప్రతిష్టంభన నెలకొనడం వల్లే ప్రచురించలేకపోతున్నామని పీఆర్‌హెచ్‌ఐ అధికార ప్రతినిధి పల్లవీ నారాయణన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒప్పందం, రచయిత్రి గోప్యతను కారణంగా చూపుతూ ప్రతిష్టంభనకు కారణమైన ఆ వివాదాస్పద అంశమేమిటో ప్రచురణ సంస్థ వెల్లడించలేదు. ''ప్రచురణకు ముందు రాతప్రతిని నిశితంగా పరిశీలించడం మా బాధ్యత, విధి. కొన్ని ప్రశ్నలు అడగడం, సిఫార్సులు చేయడం సంపాదకీయ స్వేచ్ఛలో భాగమే. రచయిత్రి తరపు బృంద సభ్యులు కొన్ని మార్పులకు అంగీకరించారు. మరికొన్నింటికి అంగీకరించలేదు. దురదృష్టవశాత్తు ఒకానొక అంశంపై అవగాహనకు రాలేకపోయాం. దీనిలో భాగంగానే ప్రచురణపై ముందుకు వెళ్లాలనుకోవడం లేదని రచయిత్రి తరపు బృందం సభ్యులు తెలిపారు. వారి అభిప్రాయాన్ని మేం గౌరవించాం'' అని పీఆర్‌హెచ్‌ఐ వివరించింది. ప్రతిష్టంభనకు కారణమైన అంశాన్ని వెల్లడించలేమని స్పష్టం చేసింది.


# అశ్లీల యాప్‌లతో తస్మాత్ జాగ్రత్త

**- వాటి ముసుగులో మాల్‌వేర్ చొరబాటు**
**- సైబర్ నేరగాళ్లకు అవకాశమిచ్చినట్లే**
**- జాతీయ సైబర్ సెక్యూరిటీ సంస్థ హెచ్చరిక**



సామాజిక మాధ్యమ వేదికలపై కనిపించే అశ్లీల (పోర్న్) యాప్‌ల ప్రకటనలతో జాగ్రత్తగా ఉండాలని సెల్‌ఫోన్ యూజర్లను ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) హెచ్చరించింది. ఆ యాప్‌ల ముసుగులో ప్రమాదకర మాల్‌వేర్ సెల్‌ఫోన్లలోకి చొరబడుతుందని తెలిపింది. వీటి ద్వారా జరిగే ఆర్థిక మోసాలు ఇటీవల బాగా పెరిగాయని వెల్లడించింది. ఈ యాప్‌లు ఫోన్ డివైజ్‌ను తమ నియంత్రణలోకి తీసుకుని, అనధికార ఆర్థిక లావాదేవీలకు అవకాశం కల్పిస్తున్నాయని పేర్కొంది. ఆండ్రాయిడ్ వినియోగదారులు గూగుల్ ప్లే స్టోర్ లేదా ఇతర విశ్వసనీయ యాప్ స్టోర్‌ల నుంచి మాత్రమే యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించింది. ప్రకటనలు, వెబ్‌సైట్లు, అనుమానాస్పద లింక్‌ల నుంచి వచ్చే ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేసుకోరాదని హెచ్చరించింది. తెలియని యాప్‌లకు అనుమతులు ఇవ్వవద్దని కోరింది. ఇన్‌స్టాల్ చేసిన యాప్‌లను క్రమం తప్పకుండా సమీక్షించి, తమకు తెలియని వాటిని తొలగించాలని కూడా వినియోగదారులకు సూచించింది.

'నైట్ ప్లే, రీలూప్, కిస్, విమో, రివో, నెక్సో, విక్సా వంటి యాప్‌లు వినియోగదారులను సోషల్ మీడియా ప్రకటనల నుంచి అశ్లీల కంటెంట్‌ను అందించే వెబ్‌సైట్‌లకు మళ్లిస్తాయి' అని ఐ4సీ ఆధ్వర్యంలో పనిచేసే నేషనల్ సైబర్‌క్రైమ్ థ్రెట్ అనలిటిక్స్ యూనిట్ హెచ్చరించింది.

ఇప్పటికే ఫోన్ హ్యాకింగ్‌కు గురైతే మొదట దాన్ని సేఫ్ మోడ్‌లో రీస్టార్ట్ చేసి, అనుమానాస్పద అప్లికేషన్‌ను అన్‌ఇన్‌స్టాల్ చేయాలని సూచించింది. అప్పటికీ మాల్‌వేర్ పోకపోతే వినియోగదారులు యాప్ యాక్సెసిబిలిటీ యాక్సెస్‌ను డిసేబుల్ చేయాలని పేర్కొంది. ఫోన్ రీస్టార్ట్ చేసిన తర్వాత కూడా యాప్ తొలగకపోతే ముఖ్యమైన డేటాను బ్యాకప్ చేసి ఫోన్‌ను రీసెట్ చేయాలని సిఫార్సు చేసింది.

ఉగ్రవాదులు రహస్యంగా మాట్లాడేందుకు అశ్లీల వెబ్‌సైట్లు, ప్రత్యేకమైన ఎన్‌క్రిప్టెడ్ అప్లికేషన్లను ఉపయోగిస్తున్నారని ఇటీవలే జాతీయ భద్రతా సంస్థలు గుర్తించాయి.

# మీ విన్నపం ఏమిటో ఒకసారి చదవండి



పురుషుల మాయమాటల వలలో చిక్కుకుని లైంగికంగా మోసపోయిన మహిళలకు భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 69 నిబంధన కింద భార్య హోదాతో పాటు ఆర్థిక రక్షణ కల్పించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. వివాహానికి ముందు లైంగిక సంబంధాలపై ఓ తీర్పులో చేసిన వ్యాఖ్యల పట్లా పిటిషనర్ అభ్యంతరం తెలిపారు. ఇద్దరు సుప్రీంకోర్టు జడ్జీలపైనా కేసులు నమోదు చేయాలన్న న్యాయవాది ఎన్.సుదర్శన్‌రావు పిటిషన్.. అపఖ్యాతికరంగా, నిర్లక్ష్యం, ధిక్కారపూరితంగా ఉందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ మండిపడ్డారు. బాధ్యతాయుతమైన న్యాయవాదిగా ఉంటూ ఇలాంటి పిటిషన్లు దాఖలు చేయొద్దని హితవు పలికారు. ఇలాంటి పిటిషన్లు దాఖలుచేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలనీ హెచ్చరించారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరైన న్యాయవాది సుదర్శన్‌రావు వాదనలు వినిపించడానికి ప్రయత్నించినప్పుడు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'మీరు ఒకసారి మీ పిటిషన్‌లోని విన్నపాన్ని అందరి ముందు చదవండి. కోర్టు హాలులో కూర్చున్న లాయర్లు వింటారు. దేశంలో పిటిషన్ల రచన ఎలా జరుగుతుందో తెలుసుకుంటారు' అని సీజేఐ అన్నారు. అయితే, సుదర్శన్‌రావు చదవకపోవడంతో పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించారు.

**ఖర్గేపై పిటిషన్ సందర్భంగా...**

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి వ్యతిరేకంగా సుదర్శన్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా కొట్టేస్తున్నట్లు సీజేఐ ప్రకటించారు. దీనిపై సుదర్శన్‌రావు స్పందిస్తూ...'ఖర్గే భాజపా సభ్యులను చంపేయమంటున్నారు. నేను కూడా భాజపా సభ్యుడినే. ఇలాంటి కేసును ఎందుకు కొట్టేస్తున్నారు? దిస్ ఈజ్ టూమచ్. భాజపా సభ్యులను చంపేయమన్న ఖర్గేను, ముస్లింలు, క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలన్న డిమాండ్‌కు మీరు సమర్థిస్తున్నారా? ముస్లింలు, క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడానికి అంబేద్కర్ మద్దతివ్వలేదు' అని వాదించారు. ఆ న్యాయవాది స్థితిని గమనించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అతని రెండో పిటిషన్‌ను చదవమని కోరారు.

# ప్రియురాలు బైక్‌పై కూర్చుంటే ప్రియుడికి ఉత్సాహం సహజమే'

**- రోడ్డు ప్రమాదం కేసులో మదురై ధర్మాసనం వ్యాఖ్య**

బైక్‌పై ప్రియురాలు కూర్చుంటే ప్రియుడికి ఉత్సాహం రావడం సహజమేనని మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమిళనాడులోని తేనికి చెందిన గోపాల్(19) 2018 మే 10న బైక్‌పై ఓ యువతితో కలిసి వెళుతుండగా వ్యాను ఢీకొంది. గోపాల్ ఘటనాస్థలిలోనే మృతి చెందగా, యువతికి తీవ్ర గాయాలయ్యాయి. కుమారుడి మృతికి పరిహారం కోరుతూ అతడి తల్లిదండ్రులు కేసు వేయడంతో తేని కోర్టు రూ.25 లక్షలు ఇవ్వాలని ఇన్సూరెన్స్ సంస్థకు ఉత్తర్వులిచ్చింది. వీటిని సవాలు చేస్తూ బీమా సంస్థ మదురై ధర్మాసనంలో అప్పీల్ చేసింది. దీనిపై న్యాయమూర్తులు జస్టిస్ జీఆర్ స్వామినాథన్, జస్టిస్ సుమతిల ధర్మాసనం విచారణ జరిపింది. ప్రమాదానికి ద్విచక్ర వాహనం నడిపిన గోపాల్ ఓ కారణమని, పరిహారంలో సగం తగ్గించాలని ఇన్సూరెన్స్ సంస్థ వాదించింది. 'ప్రమాదం తెల్లవారుజామున జరిగింది. బైక్ నడిపిన 19 ఏళ్ల యువకుడి వెనుక వైపు అతడి ప్రియురాలి కూర్చుంది. అలాంటి సమయంలో ఎవరికైనా ఉత్సాహం వస్తుంది. వ్యాన్ సరైన మార్గంలో వెళుతున్నందున ప్రమాదంలో గోపాల్ నిర్లక్ష్యం కూడా ఉన్నట్లు కన్పిస్తోంది. ఆ మేరకు పరిహారాన్ని 25 శాతం తగ్గించాలి' అని ఉత్తర్వుల్లో న్యాయమూర్తులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



# నీట్ నిరసనలు.. విద్యార్థులపై కేసులు కొట్టేసిన సుప్రీంకోర్టు



నీట్ నిరసనలకు సంబంధించి దేశవ్యాప్తంగా విద్యార్థులపై నమోదైన కేసులను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆర్టికల్ 142 కింద విస్తృత అధికారాలను ఉపయోగించి ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసింది. నిరసనలు చేపట్టిన వారిలో తీవ్ర నేర చరిత్ర కలిగి ఉన్న 2,873 మందిపై కొత్తగా కేసుల నమోదుకు కేంద్రం, ఢిల్లీ పోలీసులకు అనుమతినిచ్చింది. అదేవిధంగా.. ఆత్మహత్య చేసుకున్న నీట్ విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల్లోగా పరిహారం అందించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో సెప్టెంబర్ 5న నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విరమించుకుంటున్నట్లు సర్వోన్నత న్యాయస్థానానికి కాక్రోచ్ జనతా పార్టీ (CJP) తెలిపింది.

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన సుప్రీం ధర్మాసనం ఎదుట ఈ అంశంపై వాదనలు సాగాయి. జులై 2025 మధ్య దేశవ్యాప్తంగా నీట్ నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసేందుకు సుప్రీంకోర్టు తన అధికారాలను ఉపయోగించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. నీట్ రద్దు అనంతరం ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లిస్తామంటూ సీజేపీ ప్రతినిధులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు కేంద్రం కట్టుబడి ఉందని, దీనికి సంబంధించిన విధివిధానాల ఖరారుకు మూడు నెలల సమయం కోరారు. దీనికి అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఆ కేసులను కొట్టేసింది.

# బ్యాంకు ఆడిట్‌లో బయటపడిన రూ.7.40 కోట్ల నకిలీ నోట్లు



ఉత్తర్‌ప్రదేశ్ సహారన్‌పుర్‌లోని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లోని (PNB) కరెన్సీ చెస్ట్‌లో సుమారు రూ.7.40 కోట్ల నకిలీ నోట్లు బయటపడ్డాయి. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు బ్యాంకు అధికారులతో పాటు ఓ హౌస్‌కీపర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో పీఎన్‌బీ సీనియర్ డివిజనల్ మేనేజర్ రవి కుమార్ కేస్, కరెన్సీ చెస్ట్ మేనేజర్లు సుశీల్ శర్మ, అమిత్ కుమార్‌లను బ్యాంకు సస్పెండ్ చేసింది.


కరెన్సీ చెస్ట్ నుంచి బ్యాంకు ప్రధాన కార్యాలయానికి పంపిన నగదులో రూ.4.30 లక్షలు తగ్గినట్లు అధికారులు గుర్తించారు. దీంతో పీఎన్‌బీ మేరఠ్ శాఖకు సమాచారం అందించారు. వెంటనే బ్యాంకు నోడల్ అధికారి అరుణ్ కుమార్ అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా.. విశాల్ కుమార్ అనే పార్ట్‌టైమ్ హౌస్‌కీపర్ నోట్ల కట్టల నుంచి నగదు తీస్తున్నట్లు గుర్తించారు. దీంతో బ్యాంకు అధికారులు కరెన్సీ చెస్ట్‌లో ప్రత్యేక ఆడిట్ నిర్వహించారు. ఇందులో పలు అవకతవకలతో పాటు సుమారు రూ.7.40 కోట్ల విలువైన నకిలీ కరెన్సీ ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి ప్రత్యేక విచారణ బృందాన్ని (SIT) ఏర్పాటు చేసినట్లు డీఐజీ అభిషేక్ తెలిపారు. ఈ నకిలీ కరెన్సీని ఎవరు చేర్చారనే విషయంపై దర్యాప్తు కొనసాగుతోంది

# విమానం గాల్లో ఉండగా.. ఇంజిన్ వైఫల్యం




గాల్లో ఉన్న సమయంలో ఇండిగో విమానం ఇంజిన్‌లో సమస్య తలెత్తింది. దీంతో విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ ఘటన గోవాలో చోటుచేసుకుంది. ఆ సమయంలో విమానంలో 220మంది ప్రయాణికులు ఉన్నారు. ఉదయం 9:16 గంటలకు ఎయిరిండియా విమానం గోవా నుంచి దిల్లీ బయల్దేరింది. గాల్లో ప్రయాణిస్తున్న సమయంలో ఓ ఇంజిన్‌లో సమస్య తలెత్తినట్లు గుర్తించిన పైలట్లు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ కు సమాచారం ఇచ్చారు. దీంతో గోవా ఎయిర్‌పోర్టులో అధికారులు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. విమానాన్ని వెనక్కి మళ్లించిన పైలట్లు విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం మరో విమానంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు.

# ఎండలో నిలబెట్టిన టీచర్.. పదేళ్ల విద్యార్థిని మృతి



దేశ రాజధాని దిల్లీలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. పుస్తకం తెచ్చుకోలేదని టీచర్ ఎండలో నిలబెట్టడంతో.. పదేళ్ల విద్యార్థిని మృతిచెందింది! తూర్పు వినోద్ నగర్‌లోని సర్వోదయ కన్యా విద్యాలయలో ఆగస్టు 27న చోటుచేసుకున్న ఈ ఘటనపై దిల్లీ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ప్రస్తుతానికి టీచర్‌పై బదిలీ వేటు వేసింది. విద్యార్థిని తల్లి అంజలి కథనం ప్రకారం.. ఆగస్టు 27 ఉదయం ఆమెకు పాఠశాల నుంచి ఫోన్ వచ్చింది. అక్కడికి వెళ్లేసరికి ఆమె కుమార్తె ఎండలో నిల్చొని ఉంది. ఆరోగ్యం అప్పటికే బాగా క్షీణించింది. వెంటనే ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది. పాఠశాలకు ఓ పుస్తకం తెచ్చుకోనందుకే పాపను టీచర్ ఎండలో నిలబెట్టినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు.



## పర్యావరణ పరిరక్షణలో

# మనమెక్కడో..!

అమెరికాలోని యేల్, కొలంబియా విశ్వవిద్యాలయాల పరిశోధకులు ఇటీవల 'పర్యావరణ పనితీరు సూచీ-2026'ని విడుదల చేశారు. 177 దేశాలకుగాను ఎస్తోనియా, లక్జెంబర్గ్, యూకే, ఫిన్లాండ్, నెదర్లాండ్స్‌లు ఈ సూచీలో మొదటి అయిదు స్థానాల్లో నిలిచాయి. ఎస్తోనియా వందకు 74.79 స్కోరుతో అగ్రస్థానాన్ని దక్కించుకుంటే, లావోస్ 21.78 పాయింట్లతో అట్టడుగున ఉంది. భారత్ 22.46 స్కోరుతో 176వ స్థానానికి పరిమితమైంది. మరి ఈ పరిస్థితికి కారణమేంటి, పర్యావరణ పరిరక్షణలో మనం ఎలా ముందుకెళ్లాలి?

ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు 'పర్యావరణ పనితీరు సూచీ' ఒక శక్తిమంతమైన సాధనం. సుస్థిరత దిశగా ప్రయాణించాలనుకునే దేశాలకు ఇది ఆచరణీయ మార్గనిర్దేశాన్ని అందిస్తుంది. ఆ క్రమంలో పర్యావరణ పనితీరుకు సంబంధించిన అంశాల్లో ఆయా దేశాల పురోగతికి ఇది అద్దం పడుతుంది. తాజా సూచీలోని మొదటి 20 స్థానాల్లో జపాన్ మినహా మిగతావన్నీ ఐరోపా దేశాలే. వియత్నాం, మాలి, బంగ్లాదేశ్, ఇండియా, లావోస్‌లు చివరి అయిదు స్థానాలకే పరిమితమయ్యాయి. అమెరికా 27వ స్థానంలో నిలిస్తే, చైనా 129వ స్థానంతో సరిపెట్టుకుంది. పర్యావరణ ఆరోగ్యం విషయంలో అమెరికా మంచి ఫలితాలనే సాధించినప్పటికీ, వాతావరణ మార్పుల ఉపశమన చర్యలు, జీవవైవిధ్య సంరక్షణ విషయంలో మందకొడి ప్రగతి వల్ల సూచీలో వెనకబడిపోయింది. ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణ కట్టుబాట్ల నుంచి అమెరికా తప్పుకొంటున్న నేపథ్యంలో, రాబోయే సంవత్సరాల్లో అగ్రరాజ్యం ఈ సూచీలో మరింత వెనకబడిపోవచ్చని నివేదిక అభిప్రాయపడింది. చైనా వాయుకాలుష్యం, నీటిశుద్ధి, ఘనవ్యర్థాల నిర్వహణలో మెరుగైన పనితీరునే కనబరుస్తున్నా, వాతావరణ మార్పుల ఉపశమన చర్యల విషయంలో వెనకపట్టున ఉంది. సౌరశక్తి, జలశక్తి వంటి శుద్ధ ఇంధనాలు, విద్యుత్ వాహనాలు, అధునాతన బ్యాటరీ సాంకేతికతలపై భారీగా పెట్టుబడులను పెట్టినప్పటికీ, బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిపైనే డ్రాగన్ ఎక్కువగా ఆధారపడుతోంది.

**భారత్‌లో తీవ్ర వాయుకాలుష్యం...**

అధ్యయనకర్తలు జీవవైవిధ్యం, జీవుల ఆవాసాల పరిరక్షణ, అడవుల నరికివేత, వాయు కాలుష్య స్థాయులతోపాటు వ్యవసాయ, జలవనరుల, మత్స్యరంగ సమస్యలనూ పరిగణనలోకి తీసుకుని ఆవరణ వ్యవస్థ జీవశక్తిని లెక్కించారు. గాలి నాణ్యత, పారిశుద్ధ్యం, తాగునీరు, భారీలోహాలు, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలతో పరిసరాల ఆరోగ్యాన్ని గణించారు. వాతావరణ మార్పుల ఉపశమన చర్యల మదింపునకు కార్బన్ డయాక్సైడ్, మీథేన్, గ్రీన్‌హౌస్ వాయు స్థాయులను తీసుకున్నారు. పర్యావరణ పనితీరు మదింపులో ఆవరణ వ్యవస్థ జీవశక్తికి దాదాపు సగం; పరిసరాల ఆరోగ్యానికీ, వాతావరణ మార్పులకూ సగం ప్రాధాన్యమిచ్చారు. పర్యావరణ పనితీరులోని మొత్తం 47 సూచికల్లో సగానికి పైగా ఏఐ ఆధారిత సాధనాలపైనా, ఉపగ్రహాల ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించే సాంకేతికతలపైనా ఆధారపడినవే కావడం విశేషం. మునుపు కొలవడానికి కష్టతరమైన ఆవరణ వ్యవస్థలు, ఇతర పర్యావరణ పరిస్థితుల గురించి ఇవి కొత్త కోణాలను ఆవిష్కరించాయి. గడ్డి భూముల పరిరక్షణను తాజా నివేదికలో ఒక కొత్త సూచికగా పరిగణించారు. ప్రపంచంలోని గడ్డి మైదానాలు సగంమేర క్షీణించాయనీ, మిగిలినవి ఆక్రమణలు, వాతావరణ మార్పుల వల్ల ముప్పు ఎదుర్కొంటున్నాయని నివేదిక హెచ్చరించింది.

పర్యావరణ పనితీరు సూచీలో ఇండియా ఎక్కడో దిగువన ఉండటానికి తీవ్ర వాయుకాలుష్యం, బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి, పరిమిత జీవవైవిధ్య రక్షణలే ప్రధాన కారణాలు. తలసరి ఉద్గారాలు తక్కువేకానీ- పట్టణ వాయుకాలుష్యం, గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు వేగంగా ఎగబాకుతున్నాయి... గడచిన దశాబ్దకాలంలో సూక్ష్మధూళి కణాలు, కార్బన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్‌ల మూలంగా వాయు నాణ్యతా సూచీలు రుణాత్మక విలువలను పొందినట్లు నివేదిక వివరించింది. 2022 నాటి పర్యావరణ పనితీరు సూచీలో ఇండియా చిట్టచివరన 180 స్థానంలో నిలిచింది. అయితే, సూచీ విశ్లేషణకు ఎంచుకున్న పద్ధతి అశాస్త్రీయంగా ఉందనీ, పలు సూచికలు ఊహాగానాలపై ఆధారపడి మాత్రమే ఉన్నాయని భారత్ తప్పుపట్టింది.

**ముందున్న దేశాలకూ తప్పని సవాళ్లు**

పర్యావరణ పనితీరులో అత్యున్నత ర్యాంకులు సాధించిన ఐరోపా దేశాలు సైతం సుస్థిరాభివృద్ధికి సంబంధించి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ సుస్థిరతలో అవి బలహీనపడ్డాయి. తొలి 20 స్థానాల్లో నిలిచిన జపాన్ సైతం ఈ విభాగంలో 139వ స్థానానికే పరిమితమైంది. ప్రపంచంలోని ఏ దేశమూ 75 పాయింట్లను మించి సాధించకపోవడం- సూచీ కఠినమైన ప్రమాణాలనూ; అగ్రస్థానాల్లో నిలిచిన దేశాలు సైతం కొన్ని అంశాల్లో తమ స్థితిని మెరుగుపరచుకోవాల్సిన ఆవశ్యకతనూ తెలియజేస్తుంది. అభివృద్ధి సాధనకు పర్యావరణాన్ని మూల్యంగా చెల్లించుకోవాల్సిన అవసరం లేదని బోట్స్‌వానా, కోస్టారికాల సుస్థిర, పటిష్ఠ ఆర్థికాభివృద్ధి గాథలే చాటిచెబుతున్నాయి. భారత్ వంటి వర్ధమాన దేశాలకు ఇవి ఎంతైనా స్ఫూర్తిదాయకం.

# ఘనమైన చట్టం... అమలులో అధ్వానం!

**- రోహిణి కమిషన్: ఆరేళ్ల విచారణ... మూడేళ్లుగా మౌనం!**

**- ఓబీసీల్లో అత్యంత వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ ప్రయోజనాలు అందడం లేదంటే... కేంద్రం ఇంకా ఎందుకు మౌనం వహిస్తోంది?**






డా. ముచ్చుకోట సురేష్ బాబు,
9989988912

**భారతదేశంలో రిజర్వేషన్లు కేవలం శాతాల లెక్క కాదు. చారిత్రకంగా విద్య, ఉద్యోగాలు, సామాజిక అవకాశాలకు దూరమైన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం వాటి ప్రధాన ఉద్దేశం. అయితే, రిజర్వేషన్ ప్రయోజనాలు రిజర్వేషన్ పొందుతున్న అన్ని వర్గాలకు సమానంగా చేరుతున్నాయా అన్న ప్రశ్న ఇప్పుడు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ ప్రశ్నకు సమాధానం వెతికేందుకే కేంద్ర ప్రభుత్వం 2017 అక్టోబర్ 2న రాజ్యాంగంలోని ఆర్టికల్ 340 కింద రోహిణి కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి. రోహిణి అధ్యక్షతన ఏర్పడిన ఈ కమిషన్, ఇతర వెనుకబడిన తరగతులు — OBCల — రిజర్వేషన్‌లో ఉపవర్గీకరణను పరిశీలించింది.అసలు ప్రశ్న సూటిగా ఉంది:ఓబీసీలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, కేంద్ర విద్యాసంస్థల్లో లభిస్తున్న 27 శాతం రిజర్వేషన్ ప్రయోజనాలు అన్ని వర్గాలకు సమానంగా అందుతున్నాయా? లేక కొన్ని బలమైన, రాజకీయంగా ప్రభావవంతమైన వర్గాలకే అధిక ప్రయోజనం దక్కుతోందా?**

రిజర్వేషన్‌లోనే అసమానత?

మండల్ కమిషన్ సిఫారసుల అమలు, 1992లో సుప్రీంకోర్టు ఇంద్రా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పు నేపథ్యంలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ అమల్లోకి వచ్చింది.కానీ ఓబీసీలు ఒకే సామాజిక వర్గం కాదు. వేలాది కులాలు, ఉపకులాలు ఇందులో ఉన్నాయి. వాటి విద్యా స్థాయి, ఆర్థిక పరిస్థితి, సామాజిక వెనుకబాటుతనం, రాజకీయ ప్రాతినిధ్యం, ప్రభుత్వ ఉద్యోగాల్లో వాటా ఒకేలా లేవు. కొన్ని వర్గాలు రిజర్వేషన్ ప్రయోజనాలను పదేపదే పొందుతుంటే, మరికొన్ని వర్గాలకు తక్కువ లేదా అసలు ప్రాతినిధ్యం లేకపోతే, ఆ వ్యవస్థను నిజమైన సామాజిక న్యాయంగా ఎలా పరిగణించాలి?ఇదే రోహిణి కమిషన్ ముందున్న ప్రధాన ప్రశ్న.కమిషన్ లక్ష్యం మొత్తం 27 శాతం కోటాను పెంచడం లేదా తగ్గించడం కాదు. ఆ కోటాను ఓబీసీల్లోని వివిధ ఉప వర్గాలకు మరింత సమానంగా పంపిణీ చేయాలా అన్నదే దాని పరిశీలన.అంటే ఇది రిజర్వేషన్‌కు వ్యతిరేకమైన ఆలోచన కాదు. రిజర్వేషన్ ప్రయోజనాలు నిజంగా అత్యంత వెనుకబడిన వర్గాలకు చేరుతున్నాయా? అన్నదే అసలు పరీక్ష.

కొద్దిమందికే ఎక్కువ ప్రయోజనమా?

కేంద్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు, విశ్వవిద్యాలయాలు తదితర సంస్థల్లో ఓబీసీ వర్గాల ప్రాతినిధ్యాన్ని కమిషన్ పరిశీలించింది. కమిషన్ అధ్యయనంలో రిజర్వేషన్ ప్రయోజనాల పంపిణీలో గణనీయమైన అసమానతలు ఉన్నట్లు వెల్లడైనట్లు నివేదికలు సూచించాయి. కొద్దిమంది ఓబీసీ వర్గాలు అధిక ప్రయోజనం పొందగా, పెద్ద సంఖ్యలోని ఇతర వర్గాలకు తక్కువ లేదా దాదాపు ఎలాంటి ప్రాతినిధ్యం లభించలేదనే అంశం చర్చకు వచ్చింది.ఇది నిజమైతే, ప్రశ్న రిజర్వేషన్ అవసరమా కాదా అనేది కాదు.రిజర్వేషన్ ప్రయోజనాలు ఎవరికి అందుతున్నాయి? అన్నదే అసలు ప్రశ్న.

గణాంకాల గందరగోళం

అయితే ఇక్కడ ఒక తీవ్రమైన సమస్య ఉంది — నమ్మదగిన కులాల వారీ గణాంకాల కొరత.భారతదేశంలో చివరిసారిగా సమగ్ర కుల గణన 1931లో జరిగింది. 2011 సామాజికఆర్థిక, కుల గణనలో కుల సమాచారాన్ని సేకరించినప్పటికీ, ఓబీసీలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని విధాన రూపకల్పనకు అనువుగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. అందువల్ల ఒక ముఖ్యమైన ప్రశ్న తలెత్తుతుంది:వ్యక్తిగత ఓబీసీ వర్గాల జనాభా, విద్య, ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం ఎంత అనేది స్పష్టంగా తెలియకుండా రిజర్వేషన్‌ను ఎలా న్యాయంగా పునర్విభజించాలి?అదే సమయంలో మరో ప్రశ్న కూడా ఉంది:పూర్తి స్థాయి గణాంకాలు లేవనే కారణంతో, ఇప్పటికే కనిపిస్తున్న అసమానతలను సరిచేయడానికి చర్యలను నిరవధికంగా వాయిదా వేయాలా?డేటా విధాన నిర్ణయాలను మెరుగుపరచాలి. విధాన నిర్ణయాలను స్తంభింపజేయకూడదు.

**14 సార్లు గడువు పొడిగింపు**

రోహిణి కమిషన్ ప్రయాణమే ఈ అంశం ఎంత క్లిష్టమైనదో తెలియజేస్తుంది.మొదట స్వల్ప వ్యవధిలో నివేదిక ఇవ్వాల్సిన కమిషన్ గడువు పదేపదే పొడిగించబడింది. మొత్తం 14 సార్లు గడువు పొడిగించినట్లు సమాచారం.చివరకు దాదాపు ఆరేళ్ల అనంతరం, 2023 జూలై 31న జస్టిస్ రోహిణి తన నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించారు.కానీ నివేదిక సమర్పణతో సమస్య పరిష్కారం కాలేదు.ఇక్కడే అసలు ప్రశ్న:కమిషన్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం, నివేదిక వచ్చిన తర్వాత దానిపై స్పష్టమైన నిర్ణయం ఎందుకు ప్రకటించడం లేదు?కమిషన్ పరిశీలించగలదు. గణాంకాలను సేకరించగలదు. సిఫారసులు చేయగలదు.కానీ వాటిని విధానంగా మార్చేది మాత్రం రాజకీయ సంకల్పం.

**క్రీమీ లేయర్ వేరు... ఉపవర్గీకరణ వేరు**

ఓబీసీ చర్చలో తరచూ రెండు వేర్వేరు అంశాలు కలిసిపోతాయి — క్రీమీ లేయర్, ఉపవర్గీకరణ.క్రీమీ లేయర్ విధానం ద్వారా ఓబీసీల్లో సామాజికంగా, ఆర్థికంగా ముందున్న వ్యక్తులు, కుటుంబాలను రిజర్వేషన్ నుంచి మినహాయిస్తారు.ఉపవర్గీకరణ మాత్రం ఓబీసీలకు కేటాయించిన 27 శాతం కోటాను వివిధ సమాజాల మధ్య ఎలా సమానంగా పంపిణీ చేయాలన్నది.ఒకటి వ్యక్తి లేదా కుటుంబ స్థాయిలో పనిచేస్తే, మరొకటి సామాజిక వర్గాల స్థాయిలో పనిచేస్తుంది.

**చట్టం కంటే రాజకీయమే పెద్ద అడ్డంకా?**

2024 ఆగస్టు 1న స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దవీందర్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం, షెడ్యూల్డ్ కాస్ట్స్‌లో ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు అధికారం ఉందని తీర్పు చెప్పింది.ఈ తీర్పు నేరుగా ఓబీసీలకు సంబంధించినది కాదు. అయినప్పటికీ, రిజర్వేషన్ కేటగిరీలలో అంతర్గత అసమానతలను గుర్తించి, వాస్తవ సమానత్వం కోసం ఉపవర్గీకరణ చేయవచ్చా అన్న చర్చకు ఇది కొత్త బలం ఇచ్చింది.అయితే అసలు అడ్డంకి చట్టం మాత్రమే కాదు — రాజకీయాలు కూడా.27 శాతం కోటాను పునర్విభజిస్తే కొందరు వర్గాలకు ప్రయోజనం, మరికొందరికి నష్టం కలగవచ్చు. ఇప్పటికే అధిక ప్రయోజనాలు పొందుతున్న వర్గాలు తమ వాటాను తగ్గించడానికి వ్యతిరేకించవచ్చు. అత్యంత వెనుకబడిన వర్గాలు మాత్రం తమకు ప్రత్యేక వాటా కోరవచ్చు.కానీ సామాజిక న్యాయాన్ని కేవలం ఎన్నికల గణితంగా మార్చకూడదు.

**ఇక నిర్ణయం తీసుకోవాల్సిన సమయం**

రోహిణి కమిషన్ ఒక కీలక ప్రశ్నను మన ముందుంచింది:ఒకే కేటగిరీలో ఉన్న ప్రతి వర్గానికి ఒకే కోటా ఇవ్వడం సమానత్వమా? లేక వాస్తవ అసమానతలను గుర్తించి, అవసరమైన చోట భిన్నమైన అవకాశాలు కల్పించడమే నిజమైన సమానత్వమా?కేంద్ర ప్రభుత్వం రోహిణి కమిషన్ నివేదికపై తన వైఖరిని స్పష్టంగా ప్రకటించాలి. నివేదికను ప్రజా చర్చకు అందుబాటులోకి తీసుకురావాలి. అవసరమైన గణాంకాలను పారదర్శకంగా వెల్లడించాలి. రాష్ట్రాలు, ఓబీసీ సంఘాలు, రాజ్యాంగ నిపుణులు, సామాజిక శాస్త్రవేత్తలతో విస్తృత సంప్రదింపులు జరపాలి.2023లో నివేదిక సమర్పించబడింది. 2026లో కూడా ప్రశ్న అలాగే ఉంది.ఓబీసీల్లో అత్యంత వెనుకబడిన వర్గాలు నిజంగా రిజర్వేషన్ ప్రయోజనాలను పొందుతున్నాయా?లేక రిజర్వేషన్ అనే తలుపు తెరిచి ఉన్నప్పటికీ, దాని తాళం కొద్దిమంది చేతుల్లోనే ఉందా?రిజర్వేషన్ ఉద్దేశం తలుపులు తెరవడం.ఆ తలుపులు అందరికీ సమానంగా తెరుచుకునేలా చేయడం — అదే రోహిణి కమిషన్‌కు అసలు అర్థం.

# ప్రజలు వెచ్చించే సొమ్ముకు తగినట్లుగా

**ప్రజలు వెచ్చించే సొమ్ముకు తగినట్లుగా నాణ్యమైన వస్తుసేవలను అందించాల్సిన వ్యాపార సంస్థల్లో అనేకం లాభార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నాయి. రకరకాల మార్గాల్లో వినియోగదారులను బులిపించి బుట్టలో వేసుకుంటూ, చివరికి వారి జేబులకు కత్తెరవేసి వదిలేస్తున్నాయి. ఇలాంటి వ్యాపార మాయాజాలాలను అరికట్టి బాధితులకు వేగంగా, తక్కువ ఖర్చుతో న్యాయం అందించడానికి నాలుగు దశాబ్దాల కిందటే వినియోగదారుల రక్షణ చట్టాన్ని తీసుకొచ్చారు. అందులో భాగంగా జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో వివాద పరిష్కార వేదికలను కొలువుతీర్చారు. నేటి డిజిటల్ యుగ అవసరాలకు అనుగుణంగా ఆ శాసనాన్ని సవరించి ఆరేళ్ల క్రితం కొత్త నిబంధనావళినీ తెచ్చారు. కానీ, వినియోగదారుల కమిషన్లలో పదవులు వెంటనే భర్తీకాకపోతుండటంతో ఆ ప్రభావం కేసుల విచారణ మీద పడుతోంది. దీనిపై సుప్రీంకోర్టు లోగడ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. జాతీయ వినియోగదారుల వేదికలో పెండింగ్ కేసుల మేటపై న్యాయపాలిక తాజాగా మరోసారి మండిపడింది. సామాన్యుల కష్టార్జితాలను స్వాహాచేసే వ్యాపార మోసాల నుంచి వినియోగదారులను రక్షించడంలో యంత్రాంగం అలక్ష్యం గర్హనీయం!**



లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాల మేరకు కిందటి నెల చివరి నాటికి రాష్ట్రస్థాయి వినియోగదారుల కమిషన్లలో అధ్యక్షుల పోస్టులు 50శాతం ఖాళీగా పడి ఉన్నాయి. 44శాతం సభ్యుల స్థానాలూ అలాగే అఘోరిస్తున్నాయి. జిల్లా స్థాయిలోనూ దాదాపు 37శాతం అధ్యక్షులు, 38శాతం సభ్యుల పోస్టులు భర్తీకి నోచుకోలేదు. గత పరిశీలనల ప్రకారం దేశవ్యాప్తంగా 90 జిల్లాల్లో వినియోగదారుల కమిషన్లు అసలు ఉనికిలోనే లేవు. ఆన్‌లైన్ షాపింగ్, ఫిన్‌టెక్ యాప్‌ల వినియోగం, కపట ప్రకటనల వెల్లువ అధికమైన క్రమంలో వినియోగదారుల కమిషన్లలో కేసులు నానాటికీ పెరుగుతున్నాయి. వాటిని త్వరితగతిన కొలిక్కితెచ్చేందుకు తగిన సంఖ్యలో సిబ్బంది కొరవడటంతో వ్యాజ్యాలెన్నో బూజుపట్టిపోతున్నాయి. కేంద్రం లెక్కల ప్రకారం అన్ని వినియోగదారు కమిషన్లలో కలిపి ప్రస్తుతం దాదాపు ఆరు లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా స్థాయిలోనే 4.48 లక్షల వ్యాజ్యాలు అపరిష్కృతంగా మూలుగుతున్నాయి. తత్ఫలితంగా బాధితులకు 90 నుంచి 150 రోజుల్లోగా ఉపశమనం కల్పించాలన్న చట్ట స్ఫూర్తి నీరుగారిపోతోంది!

వినియోగదారుల కమిషన్లు బలహీనపడితే నాసిరకం వస్తుసేవలు వెల్లువెత్తుతాయి. దీంతో వ్యాపారసంస్థలపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లి కొనుగోళ్లకు వెనకంజవేస్తే దేశ ఆర్థిక వ్యవస్థే దెబ్బతింటుంది. నిరుద్యోగం కట్టు తప్పుతుంది. అలాంటి దుస్థితి తలెత్తకూడదంటే ఆయా కమిషన్లలో ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీచేయాలి. వినియోగదారుల చట్టంపై పట్టు ఉన్న, అర్హులైన న్యాయ నిపుణులకు నియామకాల్లో పెద్దపీట వేయాలి. అన్ని చోట్లా తగిన మౌలిక వసతులు కల్పించాలి. వాయిదాల సంస్కృతికి అడ్డుకట్ట పడేలా చూడాలి. మధ్యవర్తిత్వానికీ తగిన ప్రాధాన్యమివ్వాలి. సుప్రీంకోర్టు సూచించినట్లు రాష్ట్ర, జిల్లా స్థాయి వేదికల పనితీరును కాలానుగుణంగా సమీక్షిస్తే వాటి సామర్థ్యం మెరుగుపడుతుంది. జాతీయ వినియోగదారుల కమిషన్‌కు అనుబంధంగా ప్రాంతీయ, సర్క్యూట్ ధర్మాసనాలను ఏర్పాటుచేస్తే న్యాయార్థులకు అనవసర వ్యయ ప్రయాసలు తప్పుతాయి. కేసులూ త్వరగా తెములుతాయి. వంచనకు గురై ఆవేదనలో మునిగిపోయిన వారికి వినియోగదారుల వేదికలు చివరి ఆశ్రయాలే కాదు మార్కెట్‌ను క్రమశిక్షణలో ఉంచడంలోనూ అవి కీలకంగా వ్యవహరిస్తాయి. ఈ విషయాన్ని గుర్తించి ప్రభుత్వాలు వాటికి కొత్త జవసత్వాలు అందించాలి!

# విదేశీ పర్యటనల విధి విధానాలు

సార్వభౌమాధికారం అనేది ఒక దేశానికి తన విదేశీ వ్యవహారాలపై ఉండే సర్వోన్నతమైన, స్వతంత్ర అధికార పర్యవేక్షణ. ప్రపంచవ్యాప్తంగా ఏ దేశంలోనైనా విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ జాతీయ స్థాయిలో మాత్రమే ఉంటుంది. మన దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం సంస్థానాధీశులు స్వతంత్ర రాజులుగా సర్వాధికారాలు చలాయించినా విదేశీ వ్యవహారాలు బ్రిటన్ పర్యవేక్షణలో ఉండేవి. స్వాతంత్ర్యం సిద్ధించాక అవి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్నాయి. కేంద్రం పరిధిలోని విదేశాంగ మంత్రిత్వశాఖ మన దౌత్య విధానాలను అమలుపరుస్తున్నది. విదేశాలకు వెళ్లే సగటు భారతీయుడికి అవసరమైన పాస్‌పోర్టు మొదలు విదేశీ గమ్యస్థానం చేరుకున్న తర్వాత అక్కడ అతడి నడవడిని సైతం మన దౌత్య అధికారులు సదా గమనిస్తుంటారు. విదేశాలలోని మన రాయబారుల కార్యాలయాలు సంబంధిత దేశంలో మన అధికార ప్రముఖుల పర్యటనలను సమన్వయం చేస్తుంటాయి. ఈ క్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు విదేశాంగశాఖ ఆక్షేపణ తెలిపింది. దీంతో రేవంత్ తన అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. బ్రిటన్‌లో పర్యటనను పూర్తి చేసుకుని స్వదేశానికి తిరిగిరావడం ప్రజల్లోను, రాజకీయ వర్గాలలోను చర్చనీయాంశమయింది.

ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, రాష్ట్రాల మంత్రుల అధికారిక విదేశీ పర్యటనలకు కేంద్ర ప్రభుత్వ ఆమోదం అనేది రాజకీయాలకు అతీతంగా జరిగే సాధారణ ప్రక్రియ. అధికార ప్రముఖుల విదేశీ పర్యటనలను విదేశాంగ విధానానికి అనుగుణంగా సమన్వయపరచడం విదేశీ వ్యవహారాల శాఖ విధి. బహిరంగంగా వెల్లడించలేని విధానానికి విభిన్నంగా పర్యటనలు ఉంటే వాటిని ఆక్షేపించడం, ఆపడం కూడా విదేశాంగశాఖ బాధ్యత.

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్.. తెలుగు వాడైన ఒక కేంద్ర మంత్రికి విదేశాల నుంచి ఆహ్వానం ఉన్నా వారి పర్యటనకు అనుమతి ఇవ్వలేదు. తెలుగు వాడైన మరో కేంద్ర మంత్రి విదేశాల్లో ఒక సదస్సుకు వెళ్లేందుకు అనుమతించారు. గతంలో కొందరు ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలకు అనుమతి ఇవ్వలేదు. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు.. పాకిస్థాన్‌లో సీనియర్ ప్రభుత్వ అధికారులకు శిక్షణ ఇచ్చే అడ్మినిస్ట్రేటివ్ కాలేజీలో ఉపన్యాసం ఇవ్వడంతో పాటు నవాజ్ షరీఫ్ సహా పలువురు రాజకీయ నాయకులను కలవడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2012లో బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్.. పాకిస్థాన్ పర్యటనలో జిన్నా సమాధిని సందర్శించేందుకు అనుమతించింది. అయితే 2026లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు ఆక్షేపణ తెలిపింది. ఈ అనుమతి నిరాకరణపై రాజకీయ రాద్ధాంతం చేయకుండా లండన్ నుంచి హుందాగా వెనక్కివచ్చి ఆయన కూడా విజ్ఞత ప్రదర్శించారు. తిరిగి వచ్చిన అనంతరం విలేఖరుల సమావేశంలో ఆచితూచి మాట్లాడారు.

ఒకప్పుడు విధి విధానాలు, అభివృద్ధి కార్యక్రమాల అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వ అధికారిక బృందాలు పరిమిత సంఖ్యలో విదేశీ పర్యటనలు చేసేవి. ఆ తర్వాత పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పెట్టుబడుల కోసం ఉన్నతాధికారులతో సహా విదేశీ పర్యటనలకు వెళ్లడం ప్రారంభమయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడే ఈ తరహా విదేశీ పర్యటనలకు నాంది పలికారు. అవి సాధించిన సత్ఫలితాలకు ఆకర్షితులై గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ, ఆ తరువాత ఇతరులు విదేశీ పర్యటనలు చేశారు. పిదప, రాష్ట్రాల మంత్రులు సైతం విదేశీ పర్యటనలు మొదలుపెట్టారు.

ముఖ్యమంత్రుల, రాష్ట్ర మంత్రుల విదేశీ పర్యటనల వ్యయాన్ని రాష్ట్రాలే భరిస్తాయి. అయితే వీటి పట్ల జాతి దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని విదేశీ వ్యవహారాలశాఖ వ్యవహరిస్తోంది. అది స్వంత ఖర్చుతో వ్యక్తిగత పర్యటన అయినా కూడా విధిగా కేంద్రానికి సమాచారం అందించాలనే నిబంధన ఒకటి ఉన్నది. రాష్ట్రాల నేతలు విదేశీ గడ్డపై తమ రాష్ట్ర రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణంగా మాట్లాడినా, అది జాతీయ విధానానికి భిన్నంగా ఉంటే, దేశ ప్రతిష్ఠకు భంగం కలుగుతుంది కదా. అటువంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా కేంద్రం జాగ్రత్త వహిస్తుంది. విదేశాలకు వెళ్లినప్పుడు మర్యాద మన్ననలతో వ్యవహరించడం ముఖ్యం. ఏ దేశంలో ఏమి మాట్లాడాలో, ఏమి మాట్లాడకూడదో, ఎవరు ఏ స్థాయిలో ఎవరితో కలవాలి, ఎవరితో కలవకూడదు... అనే విషయమై కేంద్ర, రాష్ట్రాల అధికారిక బృందాలకు విదేశాంగశాఖ మార్గదర్శకం చేస్తుంది. విదేశాలలో ఎవరు అతిథ్యమిస్తున్నారు, ఎవరితో సమావేశమవ్వాలనుకుంటున్నారు ఇత్యాది విషయాలకు సంబంధించి సమగ్ర వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. చివరకు ఎవరైనా బహుమానం ఇస్తే స్వీకరించాలా వద్దా అనేది కూడా రాయబార కార్యాలయం నిర్దేశిస్తుంది. అవతలి వ్యక్తిని బట్టి వస్త్రధారణను సైతం సూచిస్తుంది.

భారతీయ అధికార బృందాలు విదేశీ ప్రతినిధులతో సమావేశమైనప్పుడు వారు ఏమేమి మాట్లాడారు, ఏ రకంగా వ్యవహరించారనేది కూడా పక్కన ఉండే భారతీయ దౌత్యవేత్తలు క్షుణ్ణంగా గమనిస్తూ న్యూఢిల్లీకి నివేదిస్తారు.

ఆర్థిక వ్యవస్థల ప్రపంచీకరణతో విదేశీ పెట్టుబడులు, వలసలకు ప్రాధాన్యం పెరిగిన కాలమిది. భారత నాయకులు ప్రత్యేకించి ప్రతిపక్ష నేతల విదేశీ పర్యటనల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలు పారదర్శకంగా ఉండాలని, రాజకీయాలకు అతీతంగా వాటిలో సమాఖ్య స్ఫూర్తి ప్రతిబింబించాలని రేవంత్‌రెడ్డి ఉదంతంలో యూఏఈ మాజీ భారత రాయబారి కె.సి.సింగ్ వ్యాఖ్యానించడం ముదావహం.



# ఉత్తరాంధ్ర కల సాకారం దిశగా మరో కీలక ముందడుగు

**అనకాపల్లి సెప్టెంబర్ 01 అనంత జనశక్తి న్యూస్**

ఉత్తరాంధ్ర ప్రజలు గత 20-30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న గోదావరి జలాల కల సాకారం దిశగా మరో కీలక ముందడుగు పడిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పోలవరం ఎడమ ప్రధాన కాలువ (ఎల్ఎంసీ) ఫస్ట్ ఫేజ్‌కు జలహారతి కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తరలించే మహత్తర కార్యక్రమం రేపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభం కానుందని తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో కూటమి ప్రభుత్వం ఎల్ఎంసీ పనుల్లో అనేక క్లిష్టమైన సమస్యలను అధిగమించి ఫస్ట్ ఫేజ్ పనులను పూర్తి చేసిందన్నారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణంలో ఏలేరు, పంపా, తాండవ, శారద, వరాహ వంటి ఐదు ప్రధాన నదులను దాటుకుంటూ కాలువను నిర్మించామని మంత్రి తెలిపారు. అదేవిధంగా 11 ప్రాంతాల్లో నేషనల్ హైవేలను క్రాస్ చేస్తూ పనులు పూర్తి చేశామన్నారు. కుమ్మరిలోవ వద్ద ఎన్నో ఏళ్లుగా ఉన్న భూసేకరణ సమస్యను పరిష్కరించి, అత్యంత క్లిష్టమైన ప్రాంతంలో సుమారు 100 మీటర్ల లోతు వరకు కొండను కట్ చేసి కాలువ నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు.వేలాది నిర్మాణాలు, భూసేకరణ సమస్యలు, ఇతర సాంకేతిక అవాంతరాలను అధిగమించి రెండేళ్లలోనే ఎల్ఎంసీ ఫస్ట్ ఫేజ్ పనులను పూర్తి చేయడం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు.



**ఐదేళ్లలో ఎల్ఎంసీపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం**

2019-2024 మధ్య ఐదేళ్ల పాలనలో పోలవరం ఎడమ ప్రధాన కాలువకు సంబంధించి ఒక్క తట్ట మట్టి పని కూడా జరగలేదని, ఒక్క రూపాయి పని కూడా చేయలేదని మంత్రి విమర్శించారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే క్లిష్టమైన పనులను పూర్తి చేసి, ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తీసుకురావడం ప్రారంభించిందన్నారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎల్ఎంసీ జీవనాడి**

పోలవరం ఎల్ఎంసీ ఉత్తరాంధ్ర అభివృద్ధికి జీవనాడిగా మారనుందని మంత్రి అన్నారు. ఎల్ఎంసీ ద్వారా విశాఖపట్నం నగరానికి తాగునీరు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నీరు, భవిష్యత్‌లో రానున్న పరిశ్రమలకు అవసరమైన నీటి భద్రత కల్పించవచ్చన్నారు. నీరు, పరిశ్రమలు, పెట్టుబడులతో ఉత్తరాంధ్రలో కొత్త అభివృద్ధి శకం ప్రారంభం కానుందని తెలిపారు. గతంలో ఉత్తరాంధ్ర నుంచి యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారని, నేడు ఉత్తరాంధ్రకే దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు వచ్చే పరిస్థితిని కూటమి ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.

**పోలవరం పూర్తయ్యే వరకు వేచి చూడకుండా గోదావరి జలాలు**

2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలన్నది కూటమి ప్రభుత్వ సంకల్పమని మంత్రి తెలిపారు. అయితే పోలవరం పూర్తయ్యే వరకు ఉత్తరాంధ్ర ప్రజలు వేచి చూడాల్సిన అవసరం లేకుండా పురుషోత్తపట్నం, పుష్కర ఎత్తిపోతల పథకాల ద్వారా ఎల్ఎంసీకి నీటిని అందిస్తున్నామని చెప్పారు.నాడు పురుషోత్తపట్నం, పట్టిసీమ వంటి ప్రాజెక్టులను వ్యతిరేకించిన వారు, అధికారంలోకి వస్తే పంపులు పీకేస్తామని చెప్పారని మంత్రి విమర్శించారు. అయితే నేడు అదే పురుషోత్తపట్నం ద్వారా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు అందుతున్నాయని తెలిపారు.

**పుష్కర లిఫ్ట్ పునర్నిర్మాణానికి రూ.29 కోట్లు**

పోలవరం ఎల్ఎంసీ పనుల్లో భాగంగా పుష్కర లిఫ్ట్‌కు సంబంధించిన పంపులను తొలగించాల్సి వచ్చిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రూ.29 కోట్లతో పుష్కర లిఫ్ట్ పునర్నిర్మాణ పనులు చేపట్టామని, పనులు పూర్తయితే అదనంగా 700 నుంచి 1,500 క్యూసెక్కుల వరకు నీరు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

**ఉత్తరాంధ్రలో 11 ప్రాధాన్యతా ప్రాజెక్టులకు ప్రాధాన్యత**

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి తెలిపారు. ఉత్తరాంధ్రలో 11 ప్రాధాన్యతా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, రాబోయే రెండేళ్లలో ఆయా ప్రాజెక్టులపై రూ.2,500 కోట్లు ఖర్చు చేసి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు.

మూడు దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర ప్రజలు ఎదురుచూస్తున్న నేరడి బ్యారేజీకి అవసరమైన అనుమతులను కూటమి ప్రభుత్వం సాధించిందన్నారు. రాబోయే 3-4 నెలల్లో నేరడి బ్యారేజీ పనులను పట్టాలెక్కించి ఉత్తరాంధ్ర చిరకాల కలను సాకారం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**కృష్ణా జలాలు ప్రకాశానికి.. గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు**

వెనుకబడిన ఉమ్మడి ప్రకాశం జిల్లాకు కృష్ణా జలాలను తరలించామని, ఇప్పుడు ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తరలిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కృష్ణా, గోదావరి జలాలను ప్రజల అవసరాలకు అనుగుణంగా మళ్లిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అపార భగీరథుడిలా పనిచేస్తున్నారని కొనియాడారు.టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి ఉత్తరాంధ్ర గుండెకాయ లాంటిదని, ఈ ప్రాంత అభివృద్ధికి నీరు, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.ఉత్తరాంధ్రకు గోదావరి జలాల రాకతో సాగు, తాగునీరు, పరిశ్రమలు, ఉపాధి రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడి ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో మరింత వేగంగా ముందుకు సాగుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.



# ఎన్ని అడ్డంకులొచ్చినా నా ఆశయాన్ని ఆపలేరు

**మొగల్తూరు, సెప్టెంబర్ 01, అనంతజనశక్తి న్యూస్**

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ఇంకా బాగా జరగాలి.. అందుకోసం సలహాలు, సూచనలు చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులో ఏర్పాటుచేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమం పేదవాడిని నిలబెట్టాలి.. తాత్కాలిక ఉపశమనం ఉండాలన్నారు.

''ఆడ బిడ్డలు ఎక్కడికి వెళ్లాలన్నా.. ఉచిత బస్సులు తెచ్చాం. దీపం పథకం ద్వారా 3 సిలిండర్లు ఇస్తున్నాం. పేదల సేవ కోసమే మొగల్తూరు వచ్చాను. సీఎం స్థాయిలో అనేక మార్పులు చేశాను. ఎంత సేవ చేసినా మీ రుణం తీర్చుకోలేను. అనేక సంస్కరణలకు నాంది పలికాం.. ప్రజా చైతన్య కార్యక్రమాలు తెచ్చాం. ఎన్నికల్లో మీరిచ్చిన తీర్పును ఎన్నటికీ మర్చిపోలేను. వైకాపా హయాంలో రాష్ట్రానికి కోలుకోలేని నష్టం జరిగింది. కూటమిగా ఏర్పడి రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడుతున్నాం. 45 సంవత్సరాలుగా వెనుకబడిన వర్గాలు తెదేపాని అంటిపెట్టుకునే ఉన్నాయి. ఆర్టీసీలో మహిళా కండక్టర్ల వ్యవస్థను తీసుకొచ్చాం. త్వరలో మహిళా డ్రైవర్ల వ్యవస్థను తీసుకొస్తాం. వడ్డెర సమాజిక వర్గానికి మైనింగ్ లీజులు పెట్టాం. గౌడ్ కులానికి మద్యంషాపులు కేటాయిస్తున్నాం. డీఎస్సీపై వైకాపా 350 కేసులు వేసింది. వైకాపా చేస్తోన్న ప్రచారాన్ని డీఎస్సీ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పింఛన్లు పెంచాం. పేదల పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. పేదలకు చేయూతనిస్తే ఏదైనా సాధించే సత్తా ఉంటుంది'' అని చంద్రబాబు అన్నారు.

**వైకాపా నేతలకు ఓటమి భయం పట్టుకుంది**

స్థానిక ఎన్నికల్లో ఎన్డీఏ విజయం సాధించనున్నట్లు అన్ని సర్వేలూ చెబుతున్నాయని సీఎం తెలిపారు. వైకాపా నేతలకు ఓడిపోతామనే భయం పట్టుకుందన్నారు. అందుకే ఏకగ్రీవాలు జరిగితే వదిలిపెట్టనంటూ గొడ్డలి పార్టీ నాయకుడు ఆ పార్టీ నేతలకు చెబుతున్నారని మండిపడ్డారు. ప్రజలు ఏకగ్రీవాలు చేస్తే మీరేం చేస్తారని వైకాపా నేతలను చంద్రబాబు ప్రశ్నించారు. ''గ్రామాల్లో కావాల్సింది గొడవలు కాదు.. ఐకమత్యం. మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఆయారాం.. గయారాం సంస్కృతికి చెక్ పెట్టేందుకే ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహిస్తున్నాం. స్థానిక ఎన్నికలు జరిగితే చిత్తుచిత్తుగా ఓడిపోతామనే భయంతో వైకాపా నేతలు 'సర్' పేరిట హైకోర్టుకు వెళ్లారు. ఎన్నికలు నిర్వహించకపోతే ఆర్థిక సంఘం నుంచి నిధులు నిలిచిపోతాయి'' అని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఉపసభాపతి రఘురామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

**ముఖ్యమంత్రినై 31 ఏళ్లు**

31 ఏళ్ల క్రితం ఇదే రోజు తొలిసారి ముఖ్యమంత్రినయ్యానని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరులో ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ''48 ఏళ్ల నా రాజకీయ జీవితంలో మొగల్తూరుకు ఎన్నోసార్లు వచ్చా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నేను మొట్టమొదటిసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టింది ఇవాళే. అంతకుముందు ఎన్నో రాజకీయ మార్పులు చూశా. నేను ఎన్ని జన్మలెత్తి సేవ చేసినా మీ రుణం తీర్చుకోలేను'' అని సీఎం చంద్రబాబు ప్రజలనుద్దేశించి అన్నారు.

**మగవారితో సమానంగా ఆడవారు ఎదిగారు..**

మహిళలు స్వయం సమృద్ధి సాధించడానికి డ్వాక్రా సంఘాలను స్థాపించామని సీఎం తెలిపారు. తన తల్లికి వచ్చిన కష్టం ఎవరికీ రాకూడదని దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. ప్రస్తుతం మగవారితో సమానంగా ఆడవారు ఎదిగారని అన్నారు. భవిష్యత్తులో మగవారిని మించిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదని చెప్పుకొచ్చారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు ఇస్తూ ఆదుకుంటున్నామన్నారు. దేశంలో నాలుగు వేలు, ఆరువేలు, పదివేలు, పదిహేను వేలు పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రం ఏపీనే అని అన్నారు. ఇప్పటి వరకూ 75 వేల 503 కోట్ల రూపాయలను పెన్షన్లు ఇచ్చామని.. ఆ డబ్బుతో మూడు పోలవరం ప్రాజెక్టులు కట్టవచ్చన్నారు. ఆర్థిక అసమానతలు పోవాలని.. అందరికీ సంక్షేమం అందాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

**నా ఆశయాన్ని ఆపలేరు..**

కొన్ని రోజుల్లో ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయని.. వాటిని మహిళలు నడపాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. డ్వాక్రా ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి అయ్యేలా చూస్తామని చెప్పారు. మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఆర్థిక సహాయాన్ని ఇవ్వడాన్ని తానే ప్రారంభించానని తెలిపారు. ఎలాంటి మంచి పనులు చేసినా అడ్డుపడుతున్నారని ప్రతిపక్షంపై మండిపడ్డారు. ఏజెన్సీలోని పిల్లలకు మెరుగైన విద్య అందిస్తే, ప్రపంచంలోనే మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు. వాటన్నింటికీ గొడ్డలి పార్టీ అడ్డుపడుతోందని విమర్శించారు. 'ఎంత అడ్డుపడినా నా ఆశయాన్ని ఆపలేరు' అని స్పష్టం చేశారు.

**ఆ రోజులు రాబోతున్నాయ్..**

డీఎస్సీని అడ్డుకోవడానికి 350 పిటిషన్లు వేశారని.. పారదర్శకంగా ఉద్యోగాలు ఇస్తే, కోడిగుడ్డుకు ఈకలు పీకుతున్నట్లు వ్యవహరిస్తున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీలో టీచర్లుగా ఎంపికైన వారు గొడ్డలి పార్టీని హెచ్చరించినా వారిలో మార్పులేదన్నారు. త్వరలో ఏసీ బస్సులు వస్తున్నాయని.. మహిళలు ఉచితంగా ఆ బస్సుల్లో ఎక్కే రోజులు రాబోతున్నాయని తెలిపారు. మహిళలు ఇంటిపైన సోలార్ పెట్టుకుంటే విద్యుత్ తయారు అవుతుందని.. దానివలన కొన్ని రోజుల్లో ఉచితంగా కరెంటు పొందవచ్చని సూచించారు. వేసవికాలంలో ఎండలు ఎక్కువ ఉంటాయి కాబట్టి.. ఏసీలు పెట్టుకోవచ్చని.. అదనంగా ఉండే విద్యుత్‌ను అమ్ముకోవచ్చన్నారు. ప్రతి ఇంట్లో ఒక చిన్న పారిశ్రామికవేత్త రావాలని వన్ హౌస్ వన్ ఆంత్రప్రెన్యూర్ అనే పథకాన్ని తీసుకువచ్చినట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు.

**చరిత్రను మార్చబోతున్నాం...**

అందరూ ప్రయత్నం చేస్తే మార్పు ఖచ్చితంగా వస్తుందని.. అనుకుంటే సాధించగలుగుతారని చంద్రబాబు అన్నారు. ఇప్పటికే 5 లక్షల 90 వేలు ఇళ్లు పూర్తి చేశామని.. మరో అయిదు లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. అప్పట్లో పరిశ్రమలను పారద్రోలారని.. కూటమి అధికారంలోకి వచ్చాక 22 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రేపు (బుధవారం) గోదావరి నీటిని ఉత్తరాంధ్రకు తీసుకెళ్లబోతున్నామని.. చరిత్రను మార్చబోతున్నామని తెలిపారు. భవిష్యత్తులో గోదావరి, కృష్ణా, కావేరి నదులను అనుసంధానం చేస్తామని వెల్లడించారు.

**డిప్యూటీ సీఎం ఆలోచన ప్రజల గురించే..**

మూడేళ్లుగా కరెంటు ఛార్జీలు పెంచలేదని, తగ్గించామని సీఎం అన్నారు. వైసీపీ హయాంలో 9 సార్లు 32 వేల కోట్ల రూపాయల మేర ఛార్జీలు పెంచారని చెప్పారు. లక్షా 50 వేల కోట్లు విద్యుత్ నిమిత్తం అప్పులు చేశారని వివరించారు. రెండు రూపాయలకు కిలో బియ్యం ఇచ్చి పేదలను ఆదుకున్న యుగపురుషుడు ఎన్టీఆర్ అని గుర్తుచేశారు. యూనిట్ రూపాయిన్నరకే ఆక్వాకు కరెంటు ఇస్తూ.. రూ.1200 కోట్లు సబ్సిడీ ఇస్తున్నామన్నారు. కేరళంలో ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనునిత్యం ప్రజల గురించే ఆలోచిస్తున్నారని తెలిపారు.

**గొడ్డలి పార్టీకి వణుకు...**

గొడ్డలి పార్టీకి వణుకు పుట్టిందని.. స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవం అయితే ఊరుకోమని అంటున్నారని చంద్రబాబు తెలిపారు. ప్రజలు ఏకగ్రీవం చేస్తే వారేం చేస్తారని ప్రశ్నించారు. ఆయారాం, గయారాంలకు చెక్ పెట్టేందుకే మున్సిపల్ ఎన్నికల్లో ప్రత్యక్ష ఎన్నికలను తీసుకువచ్చామన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు తీసుకువస్తే, మళ్లీ గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లిందని.. చిత్తుచిత్తుగా ఓడిపోతామనే భయంతో సర్ పేరుతో మళ్లీ కోర్టుకు వెళ్లారని దుయ్యబట్టారు.

# చేనేతలకు ఆప్కో చెల్లింపులు

**అమరావతి సెప్టెంబర్ 01, అనంత జనశక్తి న్యూస్**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత రంగ అభివృద్ధికి, నేతన్నల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ వస్తోంది. ఒకవైపు రాష్ట్రంలో చేనేత క్లస్టర్లు, టెక్స్ టైల్స్ పార్కులు ఏర్పాటు చేస్తూనే, మరోవైపు నేతన్నలకు 365 రోజులూ ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఆప్కో ద్వారా చేస్తున్న చేనేత వస్త్రాలకు సంబంధించిన కొనుగోళ్లకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ చేనేత సహకార సంఘాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తోంది. 201924 మధ్య నాటి ప్రభుత్వం ఆప్కో ద్వారా చేసిన కోనుగోళ్లకు సంబంధించి చెల్లింపులు ఏనాడూ సకాలంలో చేయలేదు. దీనివల్ల చేనేత సహకార సంఘాలకు ఆప్కో బకాయిలు పెరుగుతూ రాసాగాయి. దీనివల్ల చేనేత సంఘాలపై విపరీతమైన ఆర్థిక భారం పడసాగింది. చెల్లింపులు నిలిచిపోవడంతో నేతన్నలు కుటుంబాలు అర్థాకలితో అలమటించసాగాయి. నేతన్నల కష్టాలను సీఎం చంద్రబాబునాయుడు, పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ తెలుసుకుని, అధికారంలోకి రాగానే, ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు తక్షణ చెల్లింపులు చేస్తూ వస్తున్నారు. సకాలంలో కొనులు చేసిన వస్త్రాలకు చెల్లింపులు చేయడం ద్వారా చేనేత సంఘాలపై ఆర్థిక భారం పడకుండా ఉండడంతో పాటు నేతన్నలకు నిత్యం ఉపాధి లభించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ వస్తోంది. లివరీ చెల్లింపులు సైతం చేస్తూ, చేనేత సహకార సంఘాలకు ఆసరాగా ఉంటోంది.



**24 నెలల్లో రూ.24.51 కోట్ల చెల్లింపులు**

చేనేతలు గౌరవప్రదమైన జీవనం సాగించడమే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం లక్ష్యం. ఇందులో భాగంగా ఆప్కో ద్వారా కొనుగోలు చేసే వస్త్రాలకు ఏప్రిల్ 2024 నుంచి ఏ నెలకానెల చెల్లింపులు చేస్తూ వస్తున్నారు. మొదటి ఏడాది చేనేత సహకార సంఘాల నుంచి ఆప్కో అధికారులు 18,03 కోట్ల విలువైన వస్త్రాలను కొనుగోలు చేశారు. ఇందుకు గానూ రూ.18.02 కోట్ల మేర చెల్లింపులు చేశారు. రెండో ఏడాదిలో కూడా పూర్తిస్థాయి చెల్లింపులు చేశారు. ఈ ఏడాది మార్చి వరకూ రూ.6.61 కోట్ల వస్త్రాలను చేనేత సంఘాల నుంచి కొనుగోలు చేయగా, పూర్తి స్థాయిలో ఆ సంఘాలకు చెల్లింపులు చేశారు. రెండేళ్లలో రూ.24.51 కోట్లను చెల్లించి, చేనేత సంఘాలపై ఆర్థిక భారం పడకుండా, నేతన్నలకు నిత్యం ఉపాధి ఉండేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

**రూ.కోటీ 3 లక్షల లివరీ చెల్లింపులు**

మంత్రి సవిత ఆదేశాల మేరకు చేనేత, జౌళి శాఖాధికారులు రాష్ట్రంలోని వివిధ చేనేత సహకార సంఘాలకు రూ.1,03,38,678లను మంగళవారం చెల్లించారు. వివిధ శాఖలు, గురుకులాల పాఠశాలలకు సరఫరా చేసిన చేనేత లివరీ వస్త్రాలకు సంబంధించి ఈ చెల్లింపులు చేశారు. 20 చేనేత సహకార సంఘాల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఆ చెల్లింపులను జమ చేశారు. త్వరలో మిగిలిన బకాయిలను కూడా చెల్లించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

**చెల్లింపులపై మంత్రి సవిత ప్రత్యేక దృష్టి**

సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ దిశా నిర్దేశంలో చేనేత సహకార సంఘాలకు సకాలంలో చెల్లింపులు జరిగేలా రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ప్రత్యేక దృష్టి సారించారు. చేనేత సహకార సంఘాల ఆర్థిక బలోపేతంలో భాగంగా ఆప్కో ద్వారా చేనేత వస్త్రాలు కొనుగోళ్లు జరిగేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నేటి తరం అభిరుచులను దృష్టిలో పెట్టుకుని ముందుగానే ఏయే వస్త్రాలు కావాలో ఆయా సంఘాలకు ఆప్కో ద్వారా ఆర్డర్లు అందజేస్తున్నారు. అదే సమయంలో ఆయా సంఘాల నేతలతోనూ సమావేశమై వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వస్త్రాలు తయారు చేయాలని సూచిస్తున్నారు. శిక్షణా కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు. తయారైన ఉత్పత్తులను కొనుగోలు చేయడమే కాకుండా వాటికి తక్షణ చెల్లింపులు చేసేలా ఆప్కో అధికారులతో మంత్రి సమీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆప్కో చరిత్రలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత బకాయిల్లేకుండా మంత్రి సవిత తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి.

# ఎంపీ ల్యాడ్స్ నిధులపై అసత్య ప్రచారం చేయొద్దు

**కరీంనగర్, సెప్టెంబర్ 01, అనంత జనశక్తి న్యూస్**

ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ విడుదల చేసిన నివేదికపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులను వినియోగించుకోవడంలో పార్లమెంట్ సభ్యులు పూర్తిగా వెనుకబడ్డారన్న ఆ సంస్థ నివేదిక సత్యదూరమని బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ కింద పంపిన ప్రతిపాదనలకు సంబంధించి పనుల పురోగతి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని పేర్కొన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీ ల్యాడ్స్ కింద రూ.17.50 కోట్లు కేటాయించగా.. అందులో ఇప్పటికే రూ.16.47 కోట్లు వినియోగించామని ఆయన స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన వివరాలను గణాంకాలతో సహా బండి సంజయ్ మీడియాకు వివరించారు.



'కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి గత మూడేళ్లలో కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, హైమాస్ట్ లైట్లు, సీసీ రోడ్ల నిర్మాణాల కోసం స్థానిక ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు 627 ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపాం. ఇందులో కరీంనగర్ జిల్లా నుంచి 313, హన్మకొండ నుంచి 39, జగిత్యాల నుంచి 45, రాజన్న సిరిసిల్ల నుంచి 151, సిద్దిపేట నుంచి 79 పనులకు సంబంధించిన ప్రతిపాదనలున్నాయి. వీటిలో 82.29 శాతం పనులకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఆమోదం తెలిపారు. మిగిలిన పనుల మంజూరు అంశం ప్రాసెస్‌లో ఉంది. మొత్తంగా కేంద్రం కేటాయించిన రూ.17.5 కోట్లలో 94.1 శాతం మేరకు అంటే రూ.16.47 కోట్ల నిధులకు సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి' అని కేంద్ర మంత్రి వివరించారు. ఇందులో 16వ లోక్‌సభ సభ్యుడిగా కొనసాగిన బోయినపల్లి వినోద్ కుమార్ తన ఐదేళ్ల కాలంలో వినియోగించని రూ.2.5 కోట్లను సైతం తాను ఖర్చు చేసినట్లు బండి సంజయ్ తెలిపారు.

వాస్తవానికి స్థానిక సమస్యల పరిష్కారానికి సంబంధించి కేంద్రం ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులు సరిపోవడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా నిధులను ఏటా పెంచాలని కోరుతూ ఇప్పటికే ఎంపీల నుంచి కేంద్రానికి అనేక విజ్ఞప్తులు వెళ్తున్నాయని తెలిపారు. అయినప్పటికీ ఎంపీ ల్యాడ్స్ నిధులే ఖర్చు చేయడం లేదంటూ ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ ప్రచారం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు అనేక దశలు ఉన్నాయని తెలిపారు. ఇవేవీ పట్టించుకోకుండా ఏకపక్షంగా పార్లమెంట్ సభ్యులు ఎంపీ ల్యాడ్స్ నిధులనే వినియోగించుకోవడం లేదని ఆరోపణ చేయడమంటే బట్ట కాల్చి మీద వేయడమేనని మండిపడ్డారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 7 నెలల సమయం ఉన్నప్పటికీ తన వద్ద ఎంపీ ల్యాడ్స్ నిధులే మిగలలేదని, ఆ నిధులకు సంబంధించిన ప్రతిపాదనలన్నీ ఎప్పుడో సంబంధిత జిల్లాల కలెక్టర్లకు పంపామని వివరించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం తన వద్దకు వచ్చే ప్రజల విజ్ఞప్తులను పరిష్కరించేందుకు అవసరమైన నిధుల కోసం సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్‌ను కూడా సేకరిస్తున్నామనే విషయాన్ని ఆ సంస్థ గుర్తుంచుకోవాలన్నారు. ఇకనైనా ఎంపీ ల్యాడ్స్ నిధులకు సంబంధించి నగదు కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు దశలవారీగా వాస్తవాలను ఆ సంస్థ పరిగణనలోకి తీసుకుని, వాటిని ప్రజల ముందు ఉంచాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కోరారు.

# సుప్రీంకోర్టు జడ్జినంటూ సుకేష్ బెదిరింపులు

**- 8 ఏళ్ల జైలుశిక్ష వేసిన న్యాయస్థానం**
**- కేసులో బెయిల్ పొందేందుకు..**

**న్యూఢిల్లీ, అనంత జనశక్తి న్యూస్**

సాధారణంగా బెయిల్ పొందడానికి ఏవేవో కారణాలు చెబుతుంటారు. ఎలాగోలా బయటకు వచ్చేందుకు సాధ్యమైనన్ని పనులు చేస్తుంటారు చాలా మంది. కానీ మనం ఇప్పుడు చూడబోయే ఓ వ్యక్తి మాత్రం బెయిల్ కోసం.. ఏకంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి అవతారమెత్తాడు. అంతేనా ఓ ప్రత్యేక జడ్జీని బెదిరించి ఘోర మోసానికి పాల్పడ్డాడు. అయితే ఈ కేసులో నిందితుడైన సుకేష్ చంద్రశేఖర్‌కు ఢిల్లీ కోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ఈ తీవ్ర నేరానికి గాను అతనికి ఎనిమిది ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఢిల్లీ చీఫ్ జుడీషియల్ మెజిస్ట్రేట్ హర్షితా మిశ్రా సంచలన తీర్పును ఇచ్చారు. నిందితుడు చేసిన తప్పు.. న్యాయవ్యవస్థ స్వతంత్రతను, విచారణ ప్రక్రియను దెబ్బతీసే కుట్రగా అభివర్ణించారు.

పోలీస్ కస్టడీలోనే ప్లాన్.. కానిస్టేబుల్ ఫోన్‌తో డ్రామా

వినీతి కేసులో పోలీస్ కస్టడీలో ఉన్న సుకేష్ చంద్రశేఖర్ 2017 ఏప్రిల్ 28వ తేదీన.. కానిస్టేబుల్ మంజీత్ వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను దక్కించుకున్నాడు. దాని ద్వారా అప్పట్లో అవినీతి నిరోధక చట్టం కేసులను విచారిస్తున్న స్పెషల్ జడ్జ్ పూనం చౌదరి ల్యాండ్‌లైన్, మొబైల్ నంబర్లకు ఫోన్ చేశాడు. మొదట సుప్రీంకోర్టు జడ్జి వద్ద పనిచేసే ప్రైవేట్ కార్యదర్శినని పరిచయం చేసుకుని, ఆ తర్వాత స్వయంగా సుప్రీం కోర్టు న్యాయమూర్తినేనని బురిడీ కొట్టించాడు. తన కేసులో వెంటనే బెయిల్ మంజూరు చేయాలని, లేకపోతే ఉద్యోగ పరంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని జడ్జీని బెదిరింపులకు గురిచేశాడు.

విడివిడిగా శిక్షలు.. ఒకదాని తర్వాత ఒకటి అమలు!

కానీ జడ్జీ మాత్రం ఈ పని చేసింది ఎవరో తెలుసుకున్నారు. ముఖ్యంగా అది కానిస్టేబుల్ నెంబర్ అని తెలుసుకుని.. నిందితుడిపై మరికొన్ని కేసులు నమోదు చేశారు. ఆపై విచారణ జరిపి.. సుకేష్ చంద్రశేఖరే నిందితుడిని గుర్తించారు. ముఖ్యంగా ఆగస్టు 20వ తేదీన సుకేష్‌ను ఐపీసీ సెక్షన్లు 170 (ప్రభుత్వ ఉద్యోగిలా నటించడం), 189 (ప్రభుత్వ ఉద్యోగిని బెదిరించడం), 507 (ఆకాశ రామన్న సమాచారంతో బెదిరింపులు) కింద దోషిగా నిర్ధారించింది. ఐపీసీ 170 కింద రెండేళ్లు, 189 కింద రెండేళ్లు, 507 కింద నాలుగు ఏళ్ల జైలు శిక్షను ఖరారు చేశారు. ఈ శిక్షలన్నీ ఏకకాలంలో కాకుండా.. ఒకదాని తర్వాత ఒకటి అమలయ్యేలా ఆదేశించారు. దీంతో సుకేష్ మొత్తం 8 ఏళ్ల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది.

న్యాయవ్యవస్థపై దాడి.. డీప్‌ఫేక్స్ యుగంలో హెచ్చరిక

నేరానికి పాల్పడిన విధానం చట్టపాలనపై నేరుగా జరిపిన దాడి అని కోర్టు స్పష్టం చేసింది. ప్రస్తుత కృత్రిమ మేధ (ఏఐ), డీప్‌ఫేక్ సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కాలంలో ఈ రకమైన నేరాలు న్యాయవ్యవస్థకు సవాలుగా మారుతున్నాయని జడ్జి హెచ్చరించారు. సుకేష్ విచారణ ముగిసే సమయంలో కోర్టుపైనే నిందలు వేస్తూ విచారణను ఆలస్యం చేసేందుకు యత్నించాడని, తన చర్యల పట్ల ఎలాంటి పశ్చాత్తాపం చూపలేదని న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది.





### నూతన పోలీస్ కార్యాలయానికి

# రహదారి పనుల పరిశీలన

**నాణ్యతా ప్రమాణాలు పాటించాలి: ఎస్పీ రోహిత్‌రాజు**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో , సెప్టెంబరు 01, అనంత జనశక్తి న్యూస్ :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన పోలీస్ కార్యాలయ సముదాయానికి నిర్మిస్తున్న రహదారి పనులను జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఐపీఎస్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత అధికారులతో కలిసి నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి రహదారి నిర్మాణ ప్రగతి, మార్గం రూపకల్పన, పనుల నాణ్యతను పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేసి నూతన జిల్లా పోలీస్ కార్యాలయానికి రాకపోకలు సులభతరం అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొండ ప్రాంతాలు, సరిహద్దు భూభాగాల్లో పనులు జరుగుతున్నందున భద్రతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా రహదారికి అనుగుణంగా పటిష్ఠమైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. భవిష్యత్తులో రహదారి నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా, పక్కాగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీష్‌కుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఇ.శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఎస్ఐలు రమణారెడ్డి, సాయికిషోర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మీరు ఇచ్చిన సమాచారాన్ని అక్షర దోషాలు సరిచేసి, పత్రికా శైలిలో రెండు ప్రధాన శీర్షికలతో ఇలా అందిస్తున్నాను:



- **మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి**
- **శిరీష కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి: టీడీపీ**

**గుండాల, సెప్టెంబరు 1,(అనంత జనశక్తి న్యూస్):**

హైదరాబాద్‌లో ఆదివాసీ నర్సింగ్ విద్యార్థిని ఊకే శిరీషపై జరిగిన అత్యాచార ఘటనను టీడీపీ మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ఘటనకు పాల్పడిన నిందితులను వెంటనే గుర్తించి అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి సంపూర్ణ న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. మంగళవారం విలేకరులతో టీడీపీ నాయకులు మాట్లాడారు. ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన నిరుపేద ఆదివాసీ నర్సింగ్ విద్యార్థినిపై హైదరాబాద్‌లో అత్యాచారం జరిగి రెండు రోజులు గడిచినా నిందితులను అరెస్టు చేయకపోవడం ఆందోళనకరమని నాయకులు అన్నారు. పేద, అణగారిన వర్గాలకు చెందిన యువతులు విద్య, ఉపాధి కోసం పట్టణాలకు వెళ్తున్న నేపథ్యంలో వారికి భద్రత కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు. నేరానికి పాల్పడిన వారిపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. శిరీష కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజా, మహిళా, ఆదివాసీ సంఘాలతో కలిసి పోరాటం కొనసాగిస్తామని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తోలెం సాంబయ్య, కార్యదర్శి ఇల్లందుల అప్పారావు, నియోజకవర్గ అధికార ప్రతినిధి ఇల్లందుల నరసింహులు, మొల్కం మధు, చీకటి యాకయ్య, మొల్కం రామకృష్ణ, వాగబోయిన హుషార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈసం కాంతారావు మృతి తీవ్ర విచారకరం

**గుండాల, సెప్టెంబరు 1, (అనంత జనశక్తి న్యూస్):**



రోళ్లగడ్డ గ్రామానికి చెందిన ఈసం కాంతారావు పాము కాటుకు గురై వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం తీవ్రంగా కలచివేసిందని పంచాయతీ సర్పంచ్ భూక్యా మంగమ్మ, కాంగ్రెస్ మండల నాయకుడు భూక్యా శ్రీను అన్నారు. కాంతారావు అందరితో సత్సంబంధాలు కలిగి ఉండేవారని, ఆయన ఆకస్మిక మరణం కుటుంబ సభ్యులు, గ్రామస్తులను విషాదంలోకి నెట్టిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంతారావు మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయ్యే వరకు, అనంతరం దహన సంస్కారాలు ముగిసే వరకు భూక్యా శ్రీను కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు.

## కర్నూలులో ఉగ్ర కలకలం

**కర్నూలు, అనంత జనశక్తి న్యూస్**

కర్నూలు జిల్లాలో ఉగ్ర కలకలం రేగింది. ఉగ్ర సంస్థలతో సంబంధాలు ఉండొచ్చనే అనుమానంతో నూర్ మహమ్మద్ అనే అనుమానితుణ్ని ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు అదుపులోకి తీసుకోవటం సంచలనం రేపింది. కర్నూలులో అదుపులోకి తీసుకున్న తర్వాత నూర్ మహమ్మద్‌ను పటిష్ట భద్రత మధ్య హైదరాబాద్‌కు తరలించారు. మరోవైపు సికింద్రాబాద్‌కు చెందిన నూర్ మహమ్మద్ అనే వ్యక్తి.. కర్నూలు నగర శివార్లలో ఉంటున్నారు. గొందిపర్ల అనే గ్రామంలో ఓ పరిశ్రమలో పనిచేస్తున్నట్లు తెలిసింది. అయితే అతనిపై నిఘా పెట్టి ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు.. మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నూర్ మహమ్మద్‌కు ఇంకా ఎవరితో సంబంధాలు ఉన్నాయనే విషయంపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. అలాగే అతనికి ఏ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు ఉన్నాయనే దానిపై ఐబీ దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కర్నూలు శివారు ప్రాంతంలో ఓ పరిశ్రమలో పనిచేసే వ్యక్తిని ఐబీ అధికారులు అదుపులోకి తీసుకోవడం స్థానికంగా కలకలం రేపుతోంది. 2025లో శ్రీసత్యసాయి జిల్లాలోనూ ఇదే తరహా ఘటన చోటుచేసుకుంది. టీ మాస్టర్‌గా పనిచేసే వ్యక్తిని ధర్మవరం పోలీసులు అరెస్ట్ చేయడం అప్పట్లో సంచలనం రేపింది. ధర్మవరం మార్కెట్ సమీపంలోని ఓ బిర్యానీ సెంటర్లో టీ మాస్టర్‌గా పనిచేసే నూర్ మహమ్మద్‌కు.. ఉగ్రసంస్థలలో సంబంధం ఉన్నట్లు తేలడంతో 2025లో అరెస్ట్ చేశారు. నిందితుడు పాక్ ఉగ్ర సంస్థలతో వాట్సాప్ చాటింగ్ చేస్తున్నట్లు, 30 వరకూ తీవ్రవాద గ్రూపులలో సభ్యుడిగా ఉన్నట్లు ధర్మవరం పోలీసులు అప్పట్లో గుర్తించారు.

# ఏకలవ్య పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- **కుళ్లిన బెల్లం.. క్యాటరింగ్ అసిస్టెంట్‌పై ఆగ్రహం**
- **విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు: కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో , సెప్టెంబరు 1, అనంత జనశక్తి న్యూస్ :**



రామవరం ప్రాంతంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్-పాల్వంచను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల భవనాలు, వంటగది, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్, ఆర్‌వోఆర్ ప్లాంట్, పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 480 మంది విద్యార్థులు విద్య, వసతి సౌకర్యాలు పొందుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అన్నం, పప్పు, సాంబార్, రసం, పెరుగు, కోడిగుడ్లు, కూరగాయలను పరిశీలించి వంట సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్.. అక్కడ నిల్వ ఉన్న కూరగాయలు, ఉల్లిగడ్డలు, పప్పు దినుసులు, బియ్యం తదితర సామగ్రి వివరాలను క్యాటరింగ్ అసిస్టెంట్ మంగీలాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుళ్లిపోయిన బెల్లం కనిపించడంతో ఆయనపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సరఫరా చేసే ఆహార పదార్థాల విషయంలో నిర్లక్ష్యం సహించబోమని, విధులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందిని హెచ్చరించారు. పాఠశాలలో సెక్యూరిటీ రూమ్ లేక ఇబ్బందులు పడుతున్నామని వాచ్‌మెన్ సుజాత కలెక్టర్‌కు విన్నవించారు. పాఠశాలకు వెళ్లే అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ తనిఖీలో కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, రెవెన్యూ సిబ్బంది బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం విమానాశ్రయానికి మరో ముందడుగు

- **సెప్టెంబరు 7న కేంద్ర సాంకేతిక బృందం క్షేత్రస్థాయి పరిశీలన**
- **నాలుగైదు ప్రత్యామ్నాయ ప్రాంతాలపై సమగ్ర అధ్యయనం**
- **నివేదిక సానుకూలంగా వస్తే తదుపరి చర్యలు: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో , సెప్టెంబరు 1, అనంత జనశక్తి న్యూస్ :**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల దశాబ్దాల కల సాకారం దిశగా మరో కీలక ముందడుగు పడింది. జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియలో భాగంగా సెప్టెంబరు 7న కేంద్ర సాంకేతిక బృందం తెలంగాణలో పర్యటించనుంది. నాలుగైదు ప్రత్యామ్నాయ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రన్‌వే నిర్మాణానికి అనుకూలత, భౌగోళిక పరిస్థితులు, వాతావరణం, భూసేకరణ తదితర అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేయనుంది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో భేటీ అయ్యారు. కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుపై ఇరువురు చర్చించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్షను, విమానాశ్రయం ఏర్పాటుతో జిల్లాకు కలిగే రవాణా, పారిశ్రామిక, పర్యాటక ప్రయోజనాలను తుమ్మల కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**ప్రత్యామ్నాయ స్థలాలపై దృష్టి:**

గతంలో గుర్తించిన రెండు ప్రాంతాలు సాంకేతిక కారణాలతో అనుకూలంగా లేవని తేలడంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నాలుగైదు ప్రత్యామ్నాయ ప్రాంతాలను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. ఆయా ప్రాంతాల్లో రన్‌వే నిర్మాణానికి అనువైన భూభాగం, భూసేకరణ సౌలభ్యం, వాతావరణ పరిస్థితులు తదితర అంశాలను కేంద్ర సాంకేతిక బృందం పరిశీలించనుంది.

సాంకేతిక బృందం క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అందించే నివేదిక సానుకూలంగా వస్తే విమానాశ్రయం ఏర్పాటుకు తదుపరి చర్యలు వెంటనే చేపడతామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చినట్లు తుమ్మల వెల్లడించారు. భద్రాద్రి జిల్లా అభివృద్ధిలో విమానాశ్రయం కీలక పాత్ర పోషిస్తుందని, స్థానికుల రవాణా అవసరాలతోపాటు పారిశ్రామిక, పర్యాటక రంగాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

కేంద్ర మంత్రితో తనకున్న చిరకాల అనుబంధాన్ని తుమ్మల ఈ సందర్భంగా గుర్తుచేశారు. రామ్మోహన్ నాయుడు తండ్రి, దివంగత నేత ఎర్రన్నాయుడుతో తనకున్న అనుబంధాన్ని ప్రస్తావించారు. పుణ్యక్షేత్రం భద్రాచలంలో సీతారామచంద్రస్వామి దేవస్థానం ఉండటంతో జిల్లాకు ఉన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని వివరించారు. విమానాశ్రయం ఏర్పాటుతో జిల్లావాసులకు కలిగే ప్రయోజనాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మరో రెండు రాష్ట్రంలోని ఇతర విమానాశ్రయ ప్రతిపాదనలపైనా కేంద్రంతో చర్చలు కొనసాగుతున్నాయని తుమ్మల తెలిపారు. మామునూరు (వరంగల్), ఆదిలాబాద్ విమానాశ్రయాల అంశంపై సెప్టెంబరు 2న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో చర్చించనున్నట్లు వెల్లడించారు. కేంద్ర సాంకేతిక బృందం నివేదిక సానుకూలంగా వస్తే.. భద్రాద్రి కొత్తగూడెం గగనతలంలో విమానం రెక్కలు విప్పే రోజు ఎంతో దూరంలో లేదన్న ఆశాభావం జిల్లావాసుల్లో వ్యక్తమవుతోంది.

# ఓటర్ల సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

- **పెండింగ్ నోటీసులను వెంటనే అందజేయాలి**
- **పారదర్శకతతో.. నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలి: ఈఆర్ఓ బి.రాహుల్**

**మణుగూరు, సెప్టెంబరు 1, అనంత జనశక్తి న్యూస్ :**



ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని 110పినపాక నియోజకవర్గం ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్ఓ), ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అధికారులను ఆదేశించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో ప్రక్రియను పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం మణుగూరు తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణపై సమావేశం నిర్వహించారు. నోటీసుల జారీ, ఓటర్ల నుంచి డాక్యుమెంట్ల స్వీకరణ, ఫిర్యాదులు, అభ్యంతరాల పరిష్కారంపై చర్చించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నోటీసులను సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. నోటీసు అందజేసిన తేదీ నుంచి ఏడు రోజుల గడువు పూర్తయిన అనంతరం విచారణ చేపట్టాలని తెలిపారు. ఫిర్యాదులు, అభ్యంతరాలపై నిర్దిష్ట గడువులోగా విచారణ పూర్తి చేసి, సంబంధిత రికార్డులను పరిశీలించాలని ఆదేశించారు. అనామలీస్, నో మ్యాపింగ్ జాబితాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందుబాటులో ఉంచాలని సూచించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల సందర్భంగా ఓటర్లు సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల ప్రస్తుత స్థితిని రోజువారీగా నోటీసు బోర్డులో నవీకరించాలని ఆదేశించారు. ఇప్పటికే నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ఓటు హక్కుకు సంబంధించిన డాక్యుమెంట్లను సమర్పించేందుకు వచ్చినప్పుడు ప్రతి పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి స్వీకరించాలని అన్నారు. ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలు అందుబాటులో ఉండి ఓటర్లకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రక్రియను నిర్వహించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని రాహుల్ స్పష్టం చేశారు. ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మణుగూరు తహసీల్దార్ నరేష్, పినపాక నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎలక్షన్ డీటీ రామారావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా సజావుగా సాగాలి

- **విద్యుత్ అవసరాల దృష్ట్యా రవాణా పెంచాలి: కిషన్‌రెడ్డి**
- **ఇంధన ఒప్పందం ఉన్న కేంద్రాలకు తగినంత బొగ్గు అందిస్తాం: సింగరేణి సీఎండీ**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో , సెప్టెంబరు 1, అనంత జనశక్తి న్యూస్ :**




దేశంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ఇంధన సరఫరా ఒప్పందం (ఎఫ్ఎస్ఏ) ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రభుత్వరంగ బొగ్గు ఉత్పత్తి సంస్థలను ఆదేశించారు. సింగరేణి సంస్థ కూడా తనతో ఇంధన ఒప్పందం ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఎప్పటిలాగే తగినంత బొగ్గును అందించాలని సూచించారు. మంగళవారం సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ రంగ బొగ్గు ఉత్పత్తి సంస్థల ఉన్నతాధికారులతో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాపై కిషన్‌రెడ్డి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. దేశంలోని 28 థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ప్రస్తుతం బొగ్గు నిల్వలు తక్కువగా ఉన్నాయని తెలిపారు. ఆయా కేంద్రాలకు బొగ్గు సరఫరా చేస్తున్న ప్రభుత్వ సంస్థలు తక్షణమే స్పందించి, కొరత లేకుండా బొగ్గు రవాణాను పెంచాలని ఆదేశించారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో బొగ్గు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గును నిరంతరాయంగా అందించడం ద్వారా విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ తనతో ఇంధన సరఫరా ఒప్పందం ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గును సరఫరా చేస్తోందని సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులోనూ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన మేరకు బొగ్గు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ

వీడియో కాన్ఫరెన్స్‌లో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతితో పాటు డైరెక్టర్ (పర్సనల్, ఫైనాన్స్) గౌతమ్ పోట్రు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్, మార్కెటింగ్) తాడబోయిన శ్రీనివాస్, కొత్తగూడెం హెడ్ ఆఫీస్ నుంచి డైరెక్టర్లు ఎల్.వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, ఎం.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబరు 6న టీయూసీఐ రాష్ట్ర జనరల్ కౌన్సిల్

**కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలి**

**ఆర్. మధుసూదన్‌రెడ్డి**

**మణుగూరు, సెప్టెంబరు 1, అనంత జనశక్తి న్యూస్ :**

ఈ నెల 6న ఖమ్మంలో నిర్వహించనున్న ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్. మధుసూదన్‌రెడ్డి కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం మణుగూరులోని టీయూసీఐ కార్యాలయంలో జరిగిన ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల శ్రమను కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా కట్టబెట్టే విధానాలను అనుసరిస్తున్నాయని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం వాటిని ఆమోదించి రూల్స్ డ్రాఫ్ట్‌ను విడుదల చేసిందని తెలిపారు. ప్రస్తుత ధరలకు, కార్మికుల జీవన ప్రమాణాలకు అనుగుణంగా కనీస వేతనాలు నిర్ణయించకుండా కొత్త జీవోలు తీసుకొచ్చి వేతనాలను మూడు జోన్లుగా విభజించడం, ఉన్న జీతాలను సైతం తగ్గించడం దుర్మార్గమన్నారు. దేశంలో నెలకొన్న పెట్టుబడి సంక్షోభం ప్రభావంతో కార్మికులకు ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయని, పేదరికం మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. డిసెంబరు 20, 21 తేదీల్లో ముంబయిలో టీయూసీఐ జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికవర్గం భవిష్యత్తులో చేపట్టాల్సిన కర్తవ్యాలపై మహాసభల్లో చర్చించి దిశానిర్దేశం చేస్తారని అన్నారు. ఇందులో భాగంగా తెలంగాణలో కార్మికులు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు ఐక్యంగా ఉద్యమాలను నిర్మించడంతోపాటు సంఘాన్ని కార్మికవర్గంలో మరింత విస్తరించేందుకు కార్యాచరణ రూపొందించుకోవడానికి సెప్టెంబరు 6న ఖమ్మంలో రాష్ట్ర జనరల్ కౌన్సిల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో టీయూసీఐ మణుగూరు ఏరియా అధ్యక్షుడు జెల్ల. అశోక్, సహాయ కార్యదర్శి పి. సంజీవరెడ్డి, ఏరియా నాయకులు వి. జానయ్య, జే. యాకయ్య, కే. సమ్మయ్య, ఎం. లక్ష్మయ్య, అశోక్, రాము తదితరులు పాల్గొన్నారు.





## ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల ఏర్పాటు

**రంగారెడ్డి సెప్టెంబర్ 1 అనంత జనశక్తి న్యూస్**

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల నిర్మాణ ప్రక్రియలో భాగంగా మంగళవారం రోజున ఎల్బీనగర్ నియోజకవర్గం లోని హయత్ నగర్ మరియు లెక్చరర్స్ కాలనీల నూతన కమిటీలను ఎన్నుకొని నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా హయత్నగర్ డివిజన్ పరిధిలోని మున్సిపాలిటీ కాలనీలో ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ కోఇన్చార్జి క్యాదాస్ సతీష్ ఆధ్వర్యంలో కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎం ఎస్ పి ఎల్బీనగర్ ఇన్చార్జి ఎర్ర రవీందర్, ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్చార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ హాజరై ఉద్యమ ఆవశ్యకత, ప్రస్తుత రాజకీయ పరిణామాలు, నాయకుల బాధ్యతలు, భవిష్యత్ లక్ష్యాలు తదితర అంశాలపై కార్యకర్తలకు వివరించి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సందేశాన్ని కార్యకర్తలకు తెలియజేశారు. లెక్చరర్స్ కాలనీ నూతన అధ్యక్షులుగా కొంగరి నవీన్, అధికార ప్రతినిధిగా పరందా జగదీష్, ప్రధాన కార్యదర్శిగా బాటిలా సతీష్,ఉపాధ్యక్షులుగా పరందా చందు,కోశాధికారిగా
కొమ్ము శివ.హయత్ నగర్ డివిజన్ నూతన అధ్యక్షులుగా బట్టీల కుమార్,
అధికార ప్రతినిధిగా కొంగళి జానకి రామ్, ప్రధాన కార్యదర్శిగా పిడిగాలా అరవింద్ కుమార్, ఉపాధ్యక్షులుగా తోట్ల శ్రీనివాస్, కోశాధికారిగా అంజన్ కుమార్, కార్యదర్శగా దుబ్బాక సతీష్ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ ఒకటవ తేదీ తెలంగాణ ఉద్యోగుల జీవితాలకు చీకటి రోజు

**ఎల్బీనగర్ సెప్టెంబర్ 1 అనంత జనశక్తి న్యూస్**

సెప్టెంబర్ ఒకటవ తేదీ తెలంగాణ ఉద్యోగుల జీవితాలకు చీకటి రోజు అని సిపిఎస్ రాష్ట్ర ఉద్యోగుల వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నారు. మంగళవారం సరూర్ నగర్ తహసీల్దార్ కార్యాలయంలో సిపిఎస్ రాష్ట్ర ఉద్యోగుల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆధ్వర్యలో తహసీల్దార్ వేణుగోపాల్ మరియు నాయబ్ తహసీల్దార్ భాను ప్రసాద్ సమక్షంలో సిపిఎస్ ఉద్యోగులు పాల్గొని సిపిఎస్ విద్రోహ దినాన్ని నల్ల బ్యాచ్ ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ
ఓపిఎస్ విధానాన్ని రద్దు చేసి సిపిఎస్ అమలు పరచి తెలంగాణ ఉద్యోగుల భవిష్యత్తును చీకటిలోకి నెట్టిన రోజు అని అందుకే సెప్టెంబర్ ఒకటవ తేదిని సిపిఎస్ విద్రోహ దినంగా నిర్వహిస్తున్నమని తెలిపారు. ఈ కార్యక్రమం లో సిపిఎస్ ఉద్యోగులు మండలం ఆర్ఐలు జ్యోతి రెడ్డి, దివ్య మరియు జి పి ఓ లు ప్రవర్ధన్ రెడ్డి, మల్లారెడ్డి, నవీన్, సుమన్ కృష్ణవేణి ఇందిర కల్పన భాను శ్రీ. ఈశ్వర్ జూనియర్ అసిస్టెంట్స్ రమేష్, రామలింగేశ్వర్ రెడ్డి, రికార్డ్ అసిస్టెంట్ నవీన్ తదితరులు పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసారు




# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

- మండపాల వద్ద పటిష్ఠ బందోబస్తు..
- నిమజ్జనానికి పక్కా ప్రణాళిక
- మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలి: కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్‌రాజు

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో ,**
**సెప్టెంబరు 1, అనంత జనశక్తి న్యూస్ :**



గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, అగ్నిమాపక, ఐటీసీ, సింగరేణి, ఎక్సైజ్, విద్యుత్, నీటిపారుదల, మున్సిపల్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గణేష్ మండపాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు ముందుగానే పూర్తి వివరాలను అధికారులకు అందించాలని, మండల, మున్సిపాలిటీ స్థాయిలో అధికారులు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. నవరాత్రుల ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గణేష్ మండపాలకు విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, ప్రమాదాలు జరగకుండా విద్యుత్ అధికారులు మండపాల్లో భద్రతా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. విద్యుత్ తీగలకు తగలకుండా విగ్రహాల ఎత్తు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, మైక్ ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతి పొందాలని తెలిపారు. నిమజ్జనానికి జిల్లాతోపాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూడా విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. అధికార యంత్రాంగం సూచించిన ప్రాంతాల్లోనే నిమజ్జనం నిర్వహించాలని, రూట్‌మ్యాప్ సిద్ధం చేసి అవసరమైన రహదారి మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. నిమజ్జనానికి వినియోగించే వాహనాలకు రవాణాశాఖ నుంచి ముందస్తుగా ధ్రువీకరణ పొందాలని తెలిపారు. ప్రతి మండపం వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఉత్సవాల్లో భక్తి గీతాలకే ప్రాధాన్యం ఇవ్వాలని, అన్ని మతాలు, వర్గాల మనోభావాలను గౌరవించాలని కోరారు. రెచ్చగొట్టే అంశాలకు దూరంగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు అధికారులు, ఉత్సవ కమిటీలు సహకరించాలని తెలిపారు.

**గజ ఈతగాళ్లు సిద్ధంగా ఉండాలి: జిల్లా ఎస్పీ**

రోహిత్‌రాజు మాట్లాడుతూ నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్లను ఏర్పాటు చేయడంతోపాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. అన్ని వర్గాల సహకారంతో పండుగను ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. భక్తులకు అందించే ప్రసాదాల్లో ప్లాస్టిక్ వస్తువులను వినియోగించవద్దని, వ్యర్థాల కోసం డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని ఎస్పీ సూచించారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు పర్యావరణానికి హాని కలిగిస్తాయని తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాళ్ శ్రేష్ఠ, డీఆర్ఓ పద్మావతి, డీటీఓ వెంకట రమణ, జిల్లా ఇన్‌చార్జి ఎక్సైజ్ ఈఎస్ జానయ్య, జిల్లా అగ్నిమాపక అధికారి క్రాంతికుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్, విద్యుత్ శాఖ ఎస్ఈ మహేంద్ర, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఐటీసీ, సింగరేణి ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యెర్రా కామేష్, సభ్యులు దారా రమేష్, లక్ష్మణ్, వందనపు శ్రీధర్, మహేష్, సుజాత, విజయలక్ష్మి, యాకయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి

- శిరీష కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి: టీడీపీ

**గుండాల, సెప్టెంబరు 1,(అనంత జనశక్తి న్యూస్):**



హైదరాబాద్‌లో ఆదివాసీ నర్సింగ్ విద్యార్థిని ఊకే శిరీషపై జరిగిన అత్యాచార ఘటనను టీడీపీ మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ఘటనకు పాల్పడిన నిందితులను వెంటనే గుర్తించి అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి సంపూర్ణ న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. మంగళవారం విలేకరులతో టీడీపీ నాయకులు మాట్లాడారు. ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన నిరుపేద ఆదివాసీ నర్సింగ్ విద్యార్థినిపై హైదరాబాద్‌లో అత్యాచారం జరిగి రెండు రోజులు గడిచినా నిందితులను అరెస్టు చేయకపోవడం ఆందోళనకరమని నాయకులు అన్నారు. పేద, అణగారిన వర్గాలకు చెందిన యువతులు విద్య, ఉపాధి కోసం పట్టణాలకు వెళ్తున్న నేపథ్యంలో వారికి భద్రత కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు. నేరానికి పాల్పడిన వారిపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. శిరీష కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రజా, మహిళా, ఆదివాసీ సంఘాలతో కలిసి పోరాటం కొనసాగిస్తామని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తోలెం సాంబయ్య, కార్యదర్శి ఇల్లందుల అప్పారావు, నియోజకవర్గ అధికార ప్రతినిధి ఇల్లందుల నరసింహులు, మొల్కం మధు, చీకటి యాకయ్య, మొల్కం రామకృష్ణ, వాగబోయిన హుషార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాలతో చల్లగా ఉండాలి

- రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన
- తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**మహేశ్వరం, సెప్టెంబర్ 01 అనంత జనశక్తి న్యూస్**




తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక పూజలు నిర్వహించారు.మహేశ్వరం మండలం, తుక్కుగూడ డివిజన్ పరిధిలోని రావిర్యాల గ్రామంలో కొలువైన శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయంలో మంగళవారం ఆయన పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డితో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా భట్టి విక్రమార్క, లక్ష్మారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తెలంగాణ ప్రజలపై ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రజలు శాంతి సౌభాగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రత్యేక స్థానం ఉందని వారు పేర్కొన్నారు. గ్రామ దేవతగా ఎల్లమ్మ తల్లిని కొలిచే భక్తుల విశ్వాసం తరతరాలుగా కొనసాగుతోందన్నారు. ప్రజల విశ్వాసాలు, సంప్రదాయాలను గౌరవిస్తూ అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నాయకత్వంలో తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలని, ప్రజా సంక్షేమం మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నట్లు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని, ఆరోగ్యాన్ని ప్రసాదించాలని ఎల్లమ్మ తల్లిని ప్రార్థించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొండా సురేఖకు ఢిల్లీ పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలంటూ కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే తన కుమార్తె వ్యాఖ్యలకు, తనకు ఎలాంటి సంబంధం లేదని.. అవి ఆమె వ్యక్తిగత వ్యాఖ్యలు అంటూ.. మంత్రి కొండా సురేఖ.. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవికి తన వివరణ అందించారు. ఆ తర్వాత కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారానికి సంబంధించి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన నివేదికను టీపీసీసీ అధిష్ఠానానికి పంపినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల మధ్య ప్రస్తుతం కొండా సురేఖ ఢిల్లీ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. హైకమాండ్ పెద్దలతో జరిగే సమావేశంలో తనపై వచ్చిన ఆరోపణలు, కుమార్తె వ్యాఖ్యల వ్యవహారం, పార్టీ అంతర్గత పరిణామాలపై కొండా సురేఖ వివరణ ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. అయితే ఆమెపై ఎలాంటి చర్య తీసుకుంటారనే అంశంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. కొండా సురేఖ ఢిల్లీ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ వర్గాల్లో ప్రధానంగా రెండు రకాల చర్చలు వినిపిస్తున్నాయి. పార్టీ అధిష్ఠానం ఆమెకు కేవలం వివరణ కోరడంతో వ్యవహారాన్ని ముగిస్తుందా లేకపోతే.. పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన అంశంగా పరిగణించి ఏదైనా చర్య తీసుకుంటుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవేళ హైకమాండ్ నుంచి కఠిన నిర్ణయం వచ్చే పరిస్థితి ఉంటే మంత్రి పదవికి సురేఖ రాజీనామా చేసే అవకాశముందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి.మరోవైపు.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎం రేవంత్ ఢిల్లీకి వెళ్లిన కొద్ది సేపటికే మంత్రి కొండా సురేఖ కూడా హస్తినకు చేరుకోవడంతో కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాలపై చర్చలు జరుగుతున్నాయనే ప్రచారం ఊపందుకుంది. అయితే కేబినెట్‌లో ఖాళీగా ఉన్న స్థానాల భర్తీ అంశం కూడా ఈ ఢిల్లీ పర్యటనలతో మరోసారి తెరపైకి వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో పార్టీ పెద్దలను కలుస్తుండటంతో కేబినెట్ విస్తరణపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. కొత్త మంత్రుల ఎంపిక, ఖాళీ స్థానాల భర్తీ, పార్టీకి సంబంధించిన ఇతర అంశాలపై హైకమాండ్‌తో చర్చలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే సమయంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కావడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.





## ఏపీ పోలీసులకు క్రీడల్లో జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది

- డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా
- విభజన తర్వాత తొలిసారిగా పోలీసు స్పోర్ట్ మీట్

**అమరావతి, అనంత జనశక్తి న్యూస్**

ఉమ్మడి ఏపీ విభజన తర్వాత తొలిసారిగా పోలీసు స్పోర్ట్ మీట్ జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వ్యాఖ్యానించారు. పోలీసు ఉద్యోగం చేసేవారు 24 గంటలూ అలర్ట్‌గా ఉండాలని ఆదేశించారు. పోలీసు ఉద్యోగం నిత్యం అనేక సవాళ్లతో కూడుకున్న పని అని తెలిపారు. ఏపీ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌ను డీజీపీ ఈరోజు (మంగళవారం) ప్రారంభించి, మాట్లాడారు. పోలీసులకు క్రీడల పట్ల కూడా అంత ఆసక్తి కనబరిచే సమయం ఉండదని.. కానీ క్రీడల వల్ల మెంటల్, ఫిజికల్ ఫిట్‌నెస్ వస్తోందని వివరించారు.
క్రీడలు ఆడటం ద్వారా ఎన్నో ప్రయోజనాలు..
ఇప్పుడు ఇలా అందరూ కలిసి క్రీడల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని డీజీపీ చెప్పారు. ఇక్కడ పోటీల్లో గెలవాలని చాలా కష్టపడతారని, ఆలోచన చేస్తారని అన్నారు. ఇదే విధంగా విధుల్లో కూడా అనేక సవాళ్లను ఎదుర్కొని ఆయా కేసులు చేధించేలా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. నిత్యం క్రీడలు ఆడటం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. పోలీసులు వృత్తి రీత్యా ఎంత బిజీగా ఉన్నా... క్రీడల్లో రాణించేలా పాల్గొనాలని సూచించారు.

**క్రీడల్లో ఏపీకి మరింత గుర్తింపు రావాలి..**

ఏపీ పోలీసులకు క్రీడల్లో జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందని డీజీపీ కొనియాడారు. గతంలో అనేక పతకాలు వచ్చినా, భవిష్యత్తులో రాష్ట్ర పోలీసులు సాధించే విజయాలతో ఏపీకి క్రీడల్లో మరింత గుర్తింపు రావాలని సూచించారు. యువత కూడా చదువు, ఉద్యోగాలతో పాటు క్రీడల్లో రాణించాలని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పిలుపునిచ్చారు.




## పన్నుల రాబడిలో భారీ వృద్ధి

- ఆగస్టులో 18.05 శాతం పెరిగిన ఆదాయం
- గత ఏడాది ఆగస్టులో రూ.21,558.09 కోట్లు
- ఈ ఏడాది ఆగస్టులో రూ.25,449.80 కోట్లు

**అమరావతి, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ పన్నుల రాబడిలో గణనీయమైన వృద్ధి నమోదైంది. ఈ ఏడాది ఆగస్టు నెలలో రాష్ట్ర పన్నుల ఆదాయం 18.05 శాతం పెరిగినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. గత ఏడాది ఆగస్టులో రూ.21,558.09 కోట్లుగా ఉన్న పన్నుల రాబడి.. ఈ ఏడాది ఆగస్టులో రూ.25,449.80 కోట్లకు చేరింది.
గతేడాదితో పోలిస్తే ఈ ఆగస్టులో పన్నుల రాబడిలో రూ.485.41 కోట్ల అదనపు ఆదాయం సమకూరినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పన్నుల రాబడితో పాటు నికర వసూళ్లలోనూ దాదాపు 18 శాతం వృద్ధి నమోదైనట్లు పేర్కొన్నాయి. దీంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి పన్నుల వసూళ్లు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయని అధికారులు భావిస్తున్నారు.
వాణిజ్య పన్నుల శాఖలో చేపట్టిన సాంకేతిక సంస్కరణలు, ఆధునిక విధానాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా పన్ను ఎగవేతలను గుర్తించడం, అనుమానాస్పద లావాదేవీలను పరిశీలించడం కోసం వాణిజ్య పన్నుల శాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత స్క్రూటినీ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది.



# ఈ సినిమాతో అందరికీ 'గుడ్ టైం'



బలమైన కథతో... ఎంతో నిజాయతీగా రూపొందించిన సినిమానే మా 'గుడ్ టైం' అన్నారు నిఖిల్ గాజుల. పేరుకి తగ్గట్టుగానే ఈ సినిమాతో మా అందరికీ మంచి సమయం మొదలైందన్నారు. ఆయన కథానాయకుడిగా, చాణక్య జిల్లా దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. రమేశ్ జిల్లా నిర్మాత. అన్వ్యక్త నలాని, హృతిక్ శెట్టి, ధనరాజ్, సునీతా మనోహర్ కీలక పాత్రలు పోషించారు. ఇటీవల హైదరాబాద్‌లో టీజర్ ఆవిష్కరణ వేడుక జరిగింది. సినీ ప్రముఖులు వంశీ నందిపాటి, శశికిరణ్ తిక్క, నందు, ఐశ్వర్య, రమణారెడ్డి, లక్ష్మణ్ గుంటూరు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కథానాయకుడు మాట్లాడుతూ "ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా, మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన నాపైన నమ్మకంతో ఇందులో అవకాశమిచ్చారు దర్శకనిర్మాతలు. చిత్ర పరిశ్రమలో నా ప్రయాణం మొదలై ఆరేళ్లయింది. ఈ సినిమాతోనే మా అందరికీ గుడ్ టైం మొదలైంది. అందరినీ అలరించే ఓ మంచి సినిమా ఇది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ప్రత్యేకమైన భావోద్వేగాలతో రూపొందిన సినిమా ఇద"న్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ నిర్మాత దినేశ్ కార్తీక్‌తోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

## అల్లరి నరేశ్ 'సుడిగాడు2'

# చేయకపోవడానికి కారణమిదా?



తెలుగు సినీ ఇండస్ట్రీలో కామెడీతో మెప్పించగల అతికొద్ది మంది హీరోల్లో అల్లరి నరేశ్ ఒకరు. ఒకప్పుడు ఆయన నుంచి సినిమా వస్తుందంటే, నవ్వులు, హిట్ మినిమం గ్యారెంటీ అనుకునేవారు. కానీ, పరిస్థితి మారుతూ వచ్చింది. ప్రేక్షకుల అభిరుచులూ మారాయి. వెకిలి కామెడీని నిర్మొహమాటంగా తిరస్కరిస్తున్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా ఏకి పారేస్తున్నారు. ఈ క్రమంలో సినిమాల్లో కామెడీ సన్నివేశాలపై వస్తున్న విమర్శలపై నటుడు అల్లరి నరేశ్ స్పందించారు. చంద్రమోహన్ చింతాడ దర్శకత్వంలో నరేశ్ నటించిన 'రంభ ఊర్వశి మేనక' సెప్టెంబరు 4న విడుదల కానుంది. తాజాగా ఈ మూవీకి సెన్సార్ యూ/ఏ ఇచ్చింది. ఈ క్రమంలో చిత్ర ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడారు.

**'కితకితలు' ఇప్పుడు చేయలేం!**

"ప్రతి 10 సంవత్సరాలకు ఇండస్ట్రీ ట్రెండ్ మారుతోంది. మనం కూడా అప్‌డేట్ కావాలి. ఇవాళ కామెడీ చేయడం చాలా సున్నితమైన అంశమైపోయింది. ఏదైనా ఫేమస్ డైలాగ్ పెడుతుంటే, ఫలానా వాళ్లను అన్నారని, మనోభావాలు దెబ్బతిన్నాయని అంటున్నారు. 'సుడిగాడు2' చేయాలని చాలా మంది అడుగుతున్నారు. నాకు చాలా టెన్షన్ వస్తోంది. సామాజిక మాధ్యమాల వేదికగా ఫ్యాన్ వార్స్ మొదలైపోతాయి. ఒకప్పుడు 'కితకితలు' చేశాం. అదే ఇప్పుడు చేస్తే 'ఒక మహిళను బాడీ షేమింగ్ చేస్తారా' అని విమర్శలు వస్తాయి. కలర్, క్యాస్ట్ ఇలా దేని గురించి మాట్లాడినా అది ఇప్పుడు వైరలైపోతుంది."

**ఆర్గానిక్ కామెడీ కావాలి..**

"ఒకప్పుడు ఒక కమెడియన్‌ను మరో కమెడియన్ కొడితే నవ్వేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. 'అమానవీయం కదా!' అంటారు. అదే సమయంలో ప్రేక్షకులు అసభ్య కామెడీని అస్సలు ఇష్టపడటం లేదు. మీమ్స్ రిఫరెన్స్‌లు ఉంటే అక్కడక్కడా ఆస్వాదిస్తున్నారు. ఆర్గానిక్ కామెడీ కావాలి. పుస్తకాల్లో చదవనిది, వాట్సాప్‌లో పంపనిది మనం చెప్పాలనుకుంటున్నారు. అలాంటిది ప్రయత్నిస్తే తప్పకుండా ప్రోత్సహిస్తున్నారు" అని నరేశ్ అభిప్రాయపడ్డారు. 'రంభ ఊర్వశి మేనక' సినిమాలోనూ అల్లరి నరేశ్ పలువురు నటులను ఇమిటేట్ చేశారు. ట్రైలర్‌లో ఆయా సన్నివేశాలు నవ్వులు పూయించాయి. మరోవైపు ఇటీల విడుదలైన వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' మూవీలో సత్య పలువురు నటులను ఇమిటేట్ చేయడం సామాజిక మాధ్యమాల వేదికగా పెద్ద చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో అల్లరి నరేశ్ స్పందించడం గమనార్హం.

# అనుపమ్ ఖేర్ 555వ చిత్రం

నాలుగు దశాబ్దాలుగా తన నటనా జీవితంలో మరో ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నానని అంటున్నారు బాలీవుడ్ సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్. దశాబ్దాలుగా చిత్రసీమలో రాణిస్తున్న ఆయన... తన 555వ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్‌ను పంచుకున్నారు అనుపమ్. "కొన్ని విషయాలను కొంతకాలం పాటు మనసులోనే భద్రంగా దాచుకోవడం మంచిది. ఎందుకంటే సరైన సమయంలో వాటిని వెల్లడించడంలో ఉండే ఆనందమే వేరు. కాబట్టి ప్రస్తుతానికి నేను చెప్పేది ఒక్కటే. నా కెరీర్‌లో మైలురాయిగా నిలిచే 555వ చిత్రాన్ని ప్రకటిస్తున్నందుకు నేను ఎంతో సంతోషిస్తున్నాను. ఈ చిత్రానికి సంబంధించిన వివరాలు త్వరలోనే ప్రకటిస్తాను" అంటూ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.




## 'ఇరుముడి' నుంచి కార్తీకమాసం సాంగ్ వచ్చేసింది

రవితేజ (Ravi Teja) కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఇరుముడి'. బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్న ఈ మూవీ నుంచి మరో సాంగ్ విడుదలైంది. 'కార్తీకమాసం' అంటూ సాగే లిరికల్ వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది. అయ్యప్ప స్వామి దీక్ష విశిష్టతను తెలియజేస్తూ సాగే ఈ పాట థియేటర్‌లోనూ ప్రేక్షకులను అలరిస్తోంది. జీవీ ప్రకాశ్‌కుమార్ స్వరాలు సమకూర్చిన ఈ పాటను దర్శకుడు శివ నిర్వాణ రాయడం గమనార్హం.




# బిగ్‌ట్విస్ట్.. ముంబయితోనే హార్దిక్.. కెప్టెన్‌గా తిలక్ వర్మ!

ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య ట్రేడింగ్‌పై కొత్త అంశం తెరపైకి వచ్చింది. హార్దిక్‌ను ట్రేడ్ చేయకుండా ఆటగాడిగా జట్టులో కొనసాగించి, కెప్టెన్సీ మరొకరికి అప్పగించాలని ముంబయి భావిస్తోందట. పాండ్యను ట్రేడ్ చేయడం కోసం కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ముంబయి ఇండియన్స్ సంప్రదించిందట. అయితే, సరైన ప్రత్యామ్నాయ ఆటగాడు లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కెప్టెన్‌గా కొత్తవారిని ఎంపిక చేసేందుకు ముంబయి కసరత్తు చేస్తోందని సమాచారం. కొత్త సారథి ఎంపికలో రోహిత్ శర్మ కీలకపాత్ర పోషిస్తున్నాడని, ఇప్పటికే జట్టు యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నట్లు టాక్ నడుస్తోంది. కెప్టెన్సీ రేసులో సీనియర్ ప్లేయర్ జస్‌ప్రీత్ బుమ్రాతోపాటు యువ ఆటగాడు తిలక్ వర్మ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే, జట్టు దీర్ఘకాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తిలక్ వర్మ వైపే మొగ్గు చూపే అవకాశాలున్నాయని సమాచారం.

"హార్దిక్‌ను అసలు ట్రేడ్ చేయకపోయినా ఆశ్చర్యపోకండి. ఈ విషయమై ఆటగాడితో చర్చలు కూడా జరిగాయి. ఒక ట్రేడ్ జరగాలంటే చాలా విషయాలు ఒక కొలిక్కి రావాలి. ఇది అంత తేలికైన విషయం కాదు" అని ఫ్రాంచైజీ సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మహేల జయవర్ధనెను కోచ్‌గా తొలగిస్తారని మొన్నటివరకు వార్తలు వచ్చాయి. అయితే, వచ్చే సీజన్‌కు అతనే కోచ్‌గా ఉండే అవకాశముందట. చివరి నిమిషంలో ఎలాంటి మార్పులు లేకపోతే వచ్చే నెలలో అధికారిక ప్రకటన వెలువడే ఛాన్స్ ఉందని సమాచారం. సూర్యకుమార్ యాదవ్ గతేడాది మెరుగైన ప్రదర్శన చేయకపో యినప్పటికీ ఈ అనుభవజ్ఞుడైన ఆటగాడిని వదులుకు నేందుకు ముంబయి సిద్ధంగా లేదని తెలుస్తోంది.




# తిలక్ అజేయ శతకం



దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో తిలక్ వర్మ (106 బ్యాటింగ్; 225 బంతుల్లో 7×4) అదిరే శతకం సాధించాడు. నార్త్‌తో మ్యాచ్‌లో అతడు.. శ్రేయస్ గోపాల్ (87; 169 బంతుల్లో 11×4)తో కలిసి ఆరో వికెట్‌కు 175 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు విలువైన ఆధిక్యం అందించాడు. రెండో రోజు ఆట ఆఖరికి సౌత్ 285/9తో నిలిచింది. తిలక్‌కు తోడు కావురి సాయితేజ (0) క్రీజులో ఉన్నాడు. సౌత్ 90 పరుగుల ఆధిక్యంలో ఉంది. 40/2తో సోమవారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌత్ జోన్‌ను గుర్నూర్ బ్రార్ (4/70) దెబ్బ తీశాడు. అతడి ధాటికి తిలక్ బృందం 80కే 5 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో తిలక్ పట్టుదలతో ఆడాడు. సీనియర్ ప్లేయర్ గోపాల్‌తో కలిసి కీలక భాగస్వామ్యంతో జట్టును మెరుగైన స్థితిలో (255/5) నిలిపాడు. అయితే సౌత్ 15 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు చేజార్చుకుని, భారీ స్కోరు ఆధిక్యం సాధించే అవకాశాన్ని కోల్పోయింది. అన్షుల్ కంబోజ్, అర్ష్‌దీప్ సింగ్ రెండేసి వికెట్లు తీశారు. హైదరాబాద్ ఆటగాళ్లు కొడిమెల హిమతేజ (0), తనయ్ త్యాగరాజన్ (6) నిరాశపరిచారు.

దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో తిలక్ వర్మ (106 బ్యాటింగ్; 225 బంతుల్లో 7×4) అదిరే శతకం సాధించాడు. నార్త్‌తో మ్యాచ్‌లో అతడు.. శ్రేయస్ గోపాల్ (87; 169 బంతుల్లో 11×4)తో కలిసి ఆరో వికెట్‌కు 175 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు విలువైన ఆధిక్యం అందించాడు. రెండో రోజు ఆట ఆఖరికి సౌత్ 285/9తో నిలిచింది. తిలక్‌కు తోడు కావురి సాయితేజ (0) క్రీజులో ఉన్నాడు. సౌత్ 90 పరుగుల ఆధిక్యంలో ఉంది. 40/2తో సోమవారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌత్ జోన్‌ను గుర్నూర్ బ్రార్ (4/70) దెబ్బ తీశాడు. అతడి ధాటికి తిలక్ బృందం 80కే 5 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో తిలక్ పట్టుదలతో ఆడాడు. సీనియర్ ప్లేయర్ గోపాల్‌తో కలిసి కీలక భాగస్వామ్యంతో జట్టును మెరుగైన స్థితిలో (255/5) నిలిపాడు. అయితే సౌత్ 15 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు చేజార్చుకుని, భారీ స్కోరు ఆధిక్యం సాధించే అవకాశాన్ని కోల్పోయింది. అన్షుల్ కంబోజ్, అర్ష్‌దీప్ సింగ్ రెండేసి వికెట్లు తీశారు. హైదరాబాద్ ఆటగాళ్లు కొడిమెల హిమతేజ (0), తనయ్ త్యాగరాజన్ (6) నిరాశపరిచారు.



# పుజారా బెస్ట్ టీమ్ ఇదే.. ధోని, రోహిత్‌కు దక్కని చోటు



భారత మాజీ బ్యాటర్ ఛతేశ్వర్ పుజారా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. తన బెస్ట్ టీమ్‌ను ఎంచుకోవాలని పుజారాను కోరారు. అయితే, వారందరూ తన మాజీ సహచరులే అయి ఉండాలనే షరతు విధించారు. ఈ జాబితాలో ప్రస్తుతం ఆడుతున్న ఐదుగురు ఆటగాళ్లు.. రిటైర్ అయిన ఆరుగురిని పుజారా ఎంచుకున్నాడు. మాజీ కెప్టెన్లు మహేంద్ర సింగ్ ధోని, రోహిత్ శర్మలకు చోటు కల్పించకపోవడం గమనార్హం. అలాగే కెరీర్‌లో ఎంతోకాలం కలిసి ఆడిన అజింక్య రహానేను కూడా ఛతేశ్వర్ తన అత్యుత్తమ జట్టులోకి తీసుకోలేదు.

పుజారా తన అత్యుత్తమ జట్టులో మాజీ బ్యాటర్లు రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్‌లను ఓపెనర్లుగా ఎంచుకున్నాడు. మూడో స్థానాన్ని తనకే ఇచ్చుకున్నాడు. నాలుగో స్థానంలో క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్‌ను తీసుకున్నాడు. ఐదో స్థానంంలో విరాట్ కోహ్లీని ఎంచుకున్న పుజారా.. ఆ తర్వాతి ప్లేస్‌ను మాజీ బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్‌కు ఇచ్చాడు. వికెట్‌కీపర్‌గా ధోనికి బదులు రిషభ్ పంత్ వైపే మొగ్గుచూపాడు. చివరి నాలుగు స్థానాల్లో ఇద్దరు స్పిన్నర్లుగా రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్‌లను తీసుకున్నాడు. మిగిలిన రెండు స్థానాల్లో పేసర్లు జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమిలకు అవకాశం కల్పించాడు. 12వ ఆటగాడిగా మాజీ పేసర్ ఇషాంత్ శర్మను తీసుకున్న పుజారా.. ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యకు ఛాన్స్ ఇచ్చాడు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945